15 ప్రైవేటు బస్సులపై కేసులు, రూ.2 లక్షల జరిమానా

అగనంపూడి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని ట్రావెల్స్ బస్సులపై చర్యలు తప్పవని గాజువాక ఆర్టీవో జయప్రకాశ్ హెచ్చరించారు. స్థానిక టోల్‌గేటు వద్ద శనివారం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లతో కలిసి ఆయన హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, తిరుపతి నుంచి నగరానికి వస్తున్న పలు ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రయాణికుల నుంచి అదనపు చార్జీలు వసూలు చేసిన 15 బస్సులపై కేసులు నమోదుచేసి, రూ.రెండు లక్షల వరకూ జరిమానా విధించారు. ఈ దాడుల్లో ఎంవీ ఇన్‌స్పెక్టర్లు సత్యంనాయుడు,సృజన పాల్గొన్నారు.


రత్నాచల్ రైలు వద్ద ప్రయాణికుల రద్దీ

కిక్కిరిసిన రైళ్లు

ఇటు భువనేశ్వర్, అటు సికింద్రాబాద్... ఎటువైపు వెళ్లే రైలు చూసినా అదే పరిస్థితి

- స్టేషన్‌లో జాతర వాతావరణం
- ఊపందుకున్న పండుగ ప్రయాణాలు
- నేడు సింహాద్రి రద్దు
- జన్మభూమి, రత్నాచల్‌లకు పెరగనున్న తాకిడి

విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):
సంక్రాంతి ప్రయాణాలు ఊపందుకున్నాయి. విద్యాలయాలతోపాటు దాదాపు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు ఆదివారం నుంచి సెలవులు కావడంతో చాలామంది శనివారం కుటుంబ సమేతంగా స్వస్థలాలకు బయలుదేరారు. దీంతో భువనేశ్వర్, విజయవాడ, గుంటూరు, సికింద్రాబాద్, చెన్నై ప్రాంతాల వైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లతో పాటు విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం, పలాస, నౌపడ, రాయగడ చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లే పాసింజర్ రైళ్లు రద్దీగా మారాయి. మరోవైపు ఇతర ప్రాంతాల నుంచి విశాఖ, విజయనగరం చుట్టుపక్కల ప్రాంతాలకు వచ్చేవారితో శనివారం రైల్వే స్టేషన్ కిటకిటలాడింది.

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు రద్దీ

శనివారం విశాఖ నుంచి బయలుదేరిన, ఇతర ప్రాంతాల నుంచి విశాఖ మీదుగా నడిచిన రైళ్లు జనంతో కిక్కిరిశాయి. గుంటూరు, విజయవాడ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి రాయగడ (17243), రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12717)లు ప్రయాణికులతో కిటకిటలాడుతూ వచ్చాయి. అలాగే విశాఖ నుంచి విజయవాడ, సికింద్రాబాద్, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వెళ్లే జన్మభూమి, సింహాద్రి, రత్నాచల్, విశాఖ, తిరుమల, గోదావరి, గరీబ్‌రథ్, ఎల్‌టీటీ, మహబూబ్‌నగర్ ... మిగతా 6వ పేజీలో

బస్ కాంప్లెక్స్‌లలోనూ...

- 468 స్పెషల్స్ నడిపిన ఆర్టీసీ


ఆర్టీసీ కాంప్లెక్సులో రద్దీ

ద్వారకా కాంప్లెక్స్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):
సంక్రాంతి ప్రయాణికుల రాకపోకలతో శనివారం ఆర్టీసీ ద్వారకా కాంప్లెక్స్, మద్దిలపాలెం బస్ స్టేషన్ కిటకిటలాడాయి. డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ విశాఖ రీజియన్ అధికారులు దూర ప్రాంతాలకు 138, జోనల్ పరిధిలోని ప్రాంతాలకు 330 ప్రత్యేక సర్వీస్‌లు ఆపరేట్ చేశారు. హైదరాబాద్ 25, విజయవాడ 45, రాజమండ్రి 30, ... మిగతా 6వ పేజీలో

చుక్కల్లో విమాన టికెట్ల ధరలు

- బెంగళూరు-విశాఖపట్నం రూ.15 వేలు
- హైదరాబాద్, చెన్నైల నుంచైతే రూ.17 వేలు
- విశాఖ రావాలంటే కనీసం రూ.10వేలు ఉండాల్సిందే
- విజయవాడ-విశాఖపట్నం రూ.7 వేలు



విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):
విద్య, ఉద్యోగాల నిమిత్తం ఇతర రాష్ట్రాల్లో ఉంటున్న ఉత్తరాంధ్ర వాసులు సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు రావాలంటే టిక్కెట్లకు అధిక మొత్తాలు చెల్లించాల్సి వస్తోంది. రైళ్లలో బెర్తులు లభించడం లేదు. దాంతో ఎక్కువ మంది విమాన ప్రయాణం ఎంచుకుంటున్నారు. తక్కువ సమయంలో, రద్దీ లేకుండా చేరుకోవచ్చునని టిక్కెట్ల కోసం యత్నిస్తున్నారు. అయితే వాటి ధరలు ఆకాశంలో ఉండడంతో అవాక్కవుతున్నారు. ముఖ్యంగా బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలలో సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్నవారు ఎక్కువమంది ఉన్నారు. బెంగళూరు నుంచి శనివారం విశాఖపట్నం వచ్చినవారు రూ.15 వేలు పెట్టి టిక్కెట్లు కొనుగోలు చేశారు. సాధారణ రోజుల్లో ఈ ధర రూ.4,500కు మించి ఉండదు. కానీ ఇప్పుడు డిమాండ్ అధికంగా ఉండడంతో రెండు రెట్లు ఎక్కువ పెట్టాల్సి వచ్చింది. ఆదివారం ధరలు చూసుకుంటే అత్యధికంగా రూ.17,298, అత్యల్పంగా రూ.15,945 చూపిస్తోంది. ప్రయాణ సమయం దగ్గర పడుతున్న కొద్దీ వీటి రేట్లు పెరిగిపోతున్నాయి.

ఇక హైదరాబాద్ నుంచి అయితే రైళ్లు, బస్సులు కిటకిటలాడుతున్నాయి. దాంతో చాలామంది విమాన ప్రయాణం ... మిగతా 6వ పేజీలో

ఉక్కులో వీఆర్ఎస్!

నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవలసిందిగా యాజమాన్యం ప్రకటన

మార్చి నాటికి వేయి మందిని తగ్గించాలని నిర్ణయం

- కనీసం 15 ఏళ్ల సర్వీస్, 45 ఏళ్ల వయసు కలిగిన వారికి అవకాశం



విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):
ముందు నుంచి ప్రచారం జరుగుతున్నట్టుగానే విశాఖపట్నం స్టీల్ ప్లాంటు (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్-ఆర్ఐఎన్ఎల్) స్వచ్ఛంద పదవీ విరమణ పథకం (వలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్-వీఆర్ఎస్) శనివారం ప్రకటించింది. ఇంకా ఏడాది సర్వీసు మిగిలి ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొంది. ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకుంటే మార్చి నెలాఖరులోగా సెటిల్‌మెంట్ చేస్తారు. ఎగ్జిక్యూటివ్‌లు 500, నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు 500 మంది కలిపి మొత్తం వేయి మందికి తొలి విడత వీఆర్ఎస్ ఇస్తారు. కాంట్రాక్టు, డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, క్యాజువల్ కార్మికులు, స్టడీ లీవులో ఉన్నవారు దీనికి అనర్హులు. అయితే దరఖాస్తు చేసుకునేవారికి కనీసం 15 ఏళ్లు సర్వీసు (సీనియారిటీ), 45 ఏళ్ల వయసు ఉండాలని నిబంధన పెట్టింది.

ఏమి ఇస్తారంటే...?

వీఆర్ఎస్ తీసుకునే వారికి బేసిక్ పే, కరవు భత్యం ఇస్తారు. దీనిని సర్వీసును బట్టి లెక్కిస్తారు. పూర్తిచేసిన ప్రతి ఏడాది సర్వీస్‌కు 35 రోజుల జీతం ఇస్తారు. మిగిలిన సర్వీస్‌లో ఏడాదికి 25 రోజుల జీతం ఇస్తారు. ఇలా ప్రయోజనం పొందే రోజులు 250కి మించకుండా ఉంటాయి. వీటితో పాటు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, పదవీ విరమణ ప్రయోజనాలు అన్నీ ఇస్తారు.

ఉద్యోగుల సంఖ్య ఎలా తగ్గుతుందంటే...

సంస్థ ప్రయోజనాల కోసమే వీఆర్ఎస్ అమలు చేస్తున్నామని యాజమాన్యం పేర్కొంది. మానవ వనరులు అవసరానికి అనుగుణంగా ... మిగతా 6వ పేజీలో

వీఆర్ఎస్ ప్రకటన విరమించుకోవాలి

- పోరాట కమిటీ నాయకులు డిమాండ్
- ఉద్యోగులు వీఆర్ఎస్ తీసుకోవద్దని పిలుపు


మాట్లాడుతున్న పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):
స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరించే కార్యక్రమంలో భాగంగానే వీఆర్ఎస్ ప్రకటన వెలువడిందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఆరోపించారు. సీఐటీయూ కార్యాలయంలో శనివారం రాత్రి జరిగిన కమిటీ సమావేశంలో పలువురు మాట్లాడుతూ వీఆర్ఎస్ పేరుతో ఉద్యోగులను భయపెట్టి బయటకు పంపాలని యాజమాన్యం చూస్తోందని, ఇది ... మిగతా 6వ పేజీలో

ఏయూకు రీసెర్చ్ ప్రాజెక్టు

- రీసెర్చ్ ఫౌండేషన్‌లో భాగంగా మంజూరు
- ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో టాప్ వంద లోపు ఉన్న వర్సిటీలకు మాత్రమే అవకాశం
- రూ.10 కోట్లు కేటాయింపు
- సముద్ర గర్భంలోని వస్తువులు, జీవరాశులు, పరికరాలపై పరిశోధన



విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):
దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలను పెంచడంపై కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా నేషనల్ ఇనిస్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐ ఆర్ఎఫ్) టాప్-100లో నిలిచిన విశ్వవిద్యా లయాలకు భారీగా నిధులు మంజూరుచేసింది. టాప్-20లో నిలిచిన విశ్వవిద్యాలయాలను ఒక్కో హబ్ కేంద్రంగా ఎంపిక చేసి, 21 నుంచి వంద వరకూ ర్యాంకు సాధించిన యూనివర్సిటీలను వాటి పరిధిలో చేర్చింది. ఒక్కో హబ్‌కు రూ.100 కోట్లు చొప్పున మంజూరు చేసింది. హబ్ పరిధిలోని యూనివర్సిటీలను స్పోక్ సెంటర్లుగా వ్యవహరిస్తారు. ఈ ఏడాది ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో ఏయూ 41వ స్థానాన్ని దక్కించుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఏయూను బిట్స్ పిలానీ హబ్‌కు కేటాయించారు. బిట్స్‌కు కేటాయించిన వంద కోట్లలో స్పోక్ యూనివర్సిటీలకు పరిశోధన ప్రాజెక్టుల నిమిత్తం రూ.10 కోట్లు చొప్పున కేటాయించనుంది. ఈ మేరకు ఏయూకు రూ.10 కోట్లు బిట్స్ మంజూరుచేసింది. ఏయూ సముద్ర గర్భంలోని వస్తువులు, జీవ రాశులు, ఇతర అంశాలకు సంబంధించి పరిశోధన సాగించనున్నది. ఐదేళ్ల పాటు ఈ ప్రాజెక్టు కొనసాగుతుందని ఏయూ వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణ రావు తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా అందించే నిధులను పరిశోధన సాగించేందుకు అవసరమైన పరికరాలు, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ కొనుగోలుతోపాటు పరిశోధకులకు ఉపకార వేతనాలు చెల్లించేందుకు వినియోగించనున్నారు. ఇంజనీరింగ్‌తో పాటు సైన్స్ ... మిగతా 6వ పేజీలో


హనుమంతవాక వద్ద జాతీయ రహదారిపై భారీగా నిలిచిన వాహనాలు

జంక్షన్లు జామ్

సంక్రాంతి ప్రయాణాలు, షాపింగ్ కోసం రోడ్లపైకి జనం

- ప్రధాన కూడళ్ల వద్ద బారులు తీరిన వాహనాలు

విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):
నగరంలో శనివారం ఉదయం నుంచి రోడ్లన్నీ రద్దీగా కనిపించాయి. నగరానికి ముఖద్వారాలైన హనుమంతవాక, గాజువాక, పెందుర్తి వంటి ప్రాంతాల్లోనే కాకుండా ఏ రోడ్డును చూసినా వాహనాల తాకిడి ఎప్పుడూ లేనంతగా ఉంది. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలకు శనివారం నుంచే సంక్రాంతి సెలవులు ప్రారంభం కావడంతో ఎక్కువ మంది పండుగకు స్వస్థలాలకు ప్రయాణాలు పెట్టుకున్నారు. దీంతో విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, సబ్బవరం వైపు రోడ్లపై వాహనాల సంఖ్య పెరిగింది. మరోవైపు ఇంతవరకూ పండుగ షాపింగ్ చేయని వారంతా శనివారం సెలవుదినం కావడంతో వస్త్ర దుకాణాలు, మార్కెట్లకు పోటెత్తారు. దీంతో నగరంలోని రోడ్లపై కూడా ట్రాఫిక్ భారీగా పెరిగింది. పూర్ణామార్కెట్, జగదాంబ జంక్షన్, డాబాగార్డెన్స్, ద్వారకా నగర్ జంక్షన్, ఆశీల్‌మెట్ట జంక్షన్ వంటి ప్రాంతాలు జనాలతో కిటకిటలాడాయి. ఆయా మార్గాల్లో ప్రధాన కూడళ్ల వద్ద వాహనాలు కిలోమీటరు మేర బారులు తీరి కనిపించాయి. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడానికి కూడళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసుల సంఖ్యను అధికారులు పెంచాల్సి వచ్చింది.

జోరుగా బెట్టింగ్

తమ ఇళ్ల నుంచే ఆన్‌లైన్‌లో నిర్వహణ

- ఇటీవల ఒక ముఠాపై సీపీకి ఫిర్యాదు
- పెదవాల్తేరులో రవికుమార్ అనే బుకీని అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్
- వదిలేయాలంటూ నేతల ఫోన్లు
- ముఠాలోని మిగిలిన వారిని అరెస్టు చేయకుండా రాజకీయ ఒత్తిళ్లు?
- పోలీసులు ఏం చేస్తారనే దానిపై సర్వత్రా ఆసక్తి



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో ప్రతి వీధిలోనూ బెట్టింగ్ ముఠాలు తయారయ్యాయి. అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లే కాకుండా వివిధ దేశాల్లో జరిగే లీగ్ మ్యాచ్‌లపైనా బెట్టింగ్ నిర్వహిస్తున్నాయి. గతంలో మాదిరిగా హోటళ్లు, అద్దెకు తీసుకున్న ఫ్లాట్ల నుంచి కాకుండా బుకీలు తమ ఇళ్ల నుంచే ఆన్‌లైన్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. చాపకింద నీరులా సాగిపోతున్న బెట్టింగ్ ముఠాల వ్యవహారాలు ఇటీవల ఒక ముఠా గుట్టును టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేయడంతో బట్టబయలయ్యాయి. అయితే నిందితులను అరెస్టు చేయకుండా నగరానికి చెందిన ప్రజా ప్రతినిధులు కొందరు నేరుగా పోలీసులపై ఒత్తిడి చేస్తున్నట్టు చెబుతున్నారు.

నగరంలో ఇసుకతోట, పీతలవానిపాలెం, శివాజీపాలేనికి చెందిన కొందరు ఒక ముఠాగా ఏర్పడి భారీస్థాయిలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారంటూ పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చికి ఫిర్యాదు అందింది. ఆ ఫిర్యాదును పరిశీలించిన సీపీ దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని టాస్క్‌ఫోర్స్ పోలీసులను ఆదేశించారు. ఫిర్యాదులో బుకీలుగా పేర్కొన్న వ్యక్తుల సెల్‌ఫోన్ కాల్‌డేటా, టవర్ లోకేషన్‌తోపాటు వారి కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. ఈనెల ఆరో తేదీన బిగ్‌బాస్ క్రికెట్ లీగ్‌లో మ్యాచ్‌లపై పెదవాల్తేరులోని ఒక అపార్టుమెంట్‌లో ఉంటున్న లగుడు రవికుమార్ మొబైల్ యాప్‌ల ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్టు నిర్ధారించుకున్నారు. అతడి ఇంటిపై దాడి చేశారు. ఎస్‌యూడీపీ మొబైల్ బెట్టింగ్ యాప్ ద్వారా బెట్టింగ్ చేస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా రవికుమార్ పట్టుబడ్డాడు. 92 బ్యాంకు ఖాతాలకు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా వందకుపైగా లావాదేవీలు జరిగినట్టు గుర్తించారు. రవికుమార్‌ను విచారించడంతో పాటు అతని వద్ద లభించిన ఇతర ఆధారాల ద్వారా కాకినాడకు చెందిన కార్తీక్, జిలానీ, శివాజీపాలేనికి చెందిన బొబ్బిలి రవికుమార్, ఇసుకతోటకు చెందిన పల్లా త్రినాథ్ ప్రమేయం కూడా బెట్టింగ్‌లో పాలుపంచుకుంటున్నట్టు గుర్తించారు. రవికుమార్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారనే విషయం తెలియగానే నగరానికి చెందిన ఒక ప్రజా ప్రతినిధి నేరుగా టాస్క్‌ఫోర్స్ పోలీస్ అధికారితో మాట్లాడి అతడిని వదిలేయాలని ఒత్తిడి చేసినట్టు తెలిసింది. సీపీ నుంచే నేరుగా తమకు ఆదేశాలు రావడంతో ... మిగతా 6వ పేజీలో

ఆంధ్రజ్యోతి



కార్ అండ్ బైక్ రేస్

జనవరి నెల కూపన్ నంబర్ - 1

పాఠకుని పూర్తి పేరు	:	....
డోర్ నెంబరు	:	....
వీధి పేరు	:	....
గ్రామం / పట్టణం	:	....
మండలం	:	....
జిల్లా	:	....
పోస్టల్ పిన్‌కోడ్	:	....
ఫోన్ నంబర్	:	....

నాలుగు నెలల్లో ఆంధ్రజ్యోతి డ్రాలో ఇది జనవరి నెల మొదటి కూపన్ ఈ కూపన్‌లో మీ అడ్రస్ పూర్తి చేసి ఈ నెలలో ఇచ్చే మూడు కూపన్లను ఒక సెట్‌గా చేసి మీ వద్దనే ఉంచి రెండు నెలలు అయిన తర్వాత మొత్తం 6 కూపన్లను రెండు సెట్లుగా చేసి 2025 మార్చ్ నెల 10వ తేది నాటికి ఈ క్రింది అడ్రస్‌కు పోస్ట్ ద్వారా కాని, స్వయంగా కాని అందచేయవలెను.

నోట్ : సెట్‌గా కాకుండా విడిగా పంపిన కూపన్లు చెల్లవు.

* చట్ట ప్రకారం నిబంధనలు వర్తించును.



కూపన్లు పంపవలసిన చిరునామా

ఆంధ్రజ్యోతి కార్యాలయం, పోర్టు హాస్పటల్ ఎదురుగా,
NH-16, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-530016
సెల్ : 9985411633, 9985411029

నగరానికి గవర్నర్ రాక

విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ శనివారం రాత్రి నగరానికి చేరుకున్నారు. ఆయనకు ఎయిర్‌పోర్టులో కలెక్టర్ హరేంధిరప్రసాద్, సీపీ డాక్టర్ శంఖబ్రతబాగ్చి, ఇన్‌చార్జి జేసీ బీహెచ్ భవానీశంకర్, విశాఖ ఆర్డీవో శ్రీలేఖ, ఇతర అధికారులు స్వాగతం పలికారు. గవర్నర్ ఈనెల 13వ తేదీ ఉదయం తిరిగి విజయవాడ వెళతారు.

16 నుంచి దేహదారుఢ్య పరీక్షలు పునఃప్రారంభం

విశాలాక్షినగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో భాగంగా కైలాసగిరి రిజర్వ్ పోలీసు మైదానంలో అభ్యర్థులకు నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలు ఈనెల 12 నుంచి 15 వరకు నిలిపివేయనున్నారు. 16 నుంచి పరీక్షలు యథావిధిగా జరుగుతాయని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు.కాగా పురుష అభ్యర్థులకు శనివారం కూడా దేహదారుఢ్య పరీక్షలు కొనసాగాయి. 600 మందికి 319 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్. మోహనరావు, ఎస్‌బీ డీఎస్పీ బి. అప్పారావు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్లు టి. లక్ష్మి, టి. కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

14న మకర జ్యోతి దర్శనం

భీమునిపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీచ్‌రోడ్‌లో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ఈనెల 14న మకర జ్యోతి దర్శనం జరగనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. మంగళవారం సాయంత్రం 6.18 నిమిషాలకు మకర జ్యోతి దర్శనం జరుగుతుందని చెప్పారు. ఆ రోజు వేకువజామున నాలుగున్నర నుంచి ఆలయంలో స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఊరేగింపు జరుగుతుందన్నారు. ఈమేరకు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

రోడ్డు పనులు పరిశీలన

సింహాచలం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డు పరిధిలో జరుగుతున్న సీసీ రోడ్లు, కల్వర్టు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ పివి నరసింహ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వార్డు పరిధిలోని ప్రియాగార్డెన్స్‌లో స్వామివారి కల్యాణ మండపం నుంచి సింహాచలం దేవస్థానం పరిపాలనా భవనం వరకు జరుగుతున్న రోడ్డు పనులను శనివారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ ఫేజ్-2లోని లింక్ రోడ్ల నిర్మాణం చేపట్టి, ప్రజల ఇబ్బందులు తొలగిస్తామని చెప్పారు.

బాసర కళాశాలపై చర్యలు తీసుకోవాలి : ఎస్‌ఎఫ్‌ఐ

తగరపువలస, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : తగరపువలసలోని బాసర కళాశాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వారు కళాశాల వద్ద విలేకరులతో మాట్లాడారు. పండగ సెలవుల్లో కూడా తరగతులు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. దీనివల్ల పద్మనాభం మండలం ఏనుగులపాలెం వద్ద అదే కళాశాలకు చెందిన భరణి అనే విద్యార్థిని బస్సు కింద పడి మృతి చెందిందన్నారు.కళాశాల బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్నారని ఆరోపించారు. విలేకరులతో మాట్లాడిన వారిలో సాయితేజ, శ్రీనివాస్, చాందిని వాసవి ఉన్నారు.

అలరించిన శాస్త్రీయ నృత్యాలు

మధురవాడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సంబరాల్లో భాగంగా శిల్పారామంలో శనివారం నగరానికి చెందిన నృత్యభారతి డ్యాన్స్ అకాడమీ కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. మౌనిక పట్నాయక్ దర్శకత్వంలో కళాకారులు లిఖిత, చంద్రిక, భవ్యశ్రీ, అనన్య, లాస్యప్రియ ప్రదర్శనలు ఇచ్చారు.

రేవిడిలో క్రికెట్ పోటీలు

పద్మనాభం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేవిడి గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా శనివారం జట్లమ్మతల్లి ప్రీమియర్ లీగ్ (జేపీఎల్) క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఐపీఎల్‌లో మాదిరిగా 70 మంది క్రీడాకారులను ఆది ఆర్మీ సూపర్ కింగ్స్, జేడీకే వారియర్స్, సమర్ వారియర్స్, ఎస్‌టీకే 11, టీం వైపర్ ఫ్రాంచైజీస్ ఎంపిక చేసుకున్నాయి.

తాగునీటి బోరు ప్రారంభం

భీమునిపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బోయవీధిలో ఏర్పాటు చేసిన తాగునీటి బోరును మత్స్యకార పెద్దలు కాసరపు దుర్గారావు, కొక్కిరి కాశీడు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కాసరపు నాగరాజు, కొక్కిరి నూకరాజు, వాడమొదలు కృష్ణ, కొక్కిరి అప్పన్న, ఎల్లాజి, గొల్లయ్య, సింహాద్రి పాల్గొన్నారు.




భీమిలిలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అక్కారడిశల్ ప్రసాదం నివేదన

సంప్రదాయబద్ధంగా కూడారై ఉత్సవం

సింహాచలం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసోత్సవాల్లో భాగంగా వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధానంలో శనివారం కూడారై ఉత్సవం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో బంగారు తొళ్ళక్కియాన్‌లో అధిష్ఠింపజేశారు. షోడశోపచ పూజలు చేసిన తరువాత ఎదురుగా మరో పల్లకిలో అమ్మవారిని ఉంచి ఎదురు సన్నాహ ఉత్సవం జరిపారు. ప్రధానాలయం నీలాద్రి గుమ్మం ఎదురుగా ఇరువైపులా స్వామి, అమ్మవార్లను ఉంచి అతిథి మర్యాదలతో సత్కరించారు. ఇద్దరూ పుష్పమాలికలు మార్చుకొనే విధానాన్ని ఇద్దరు అర్చకులు నర్తిస్తూ జరిపిన తీరు భక్తులను ఆనంద పరవశులను చేసింది. తరువాత బేడా మండపంలో తిరువీధి నిర్వహించారు. అనంతరం ఆండాళ్ సన్నిధిలో ప్రత్యేక సేవాకాలం పూజలు చేసి కూడారై పాశర విన్నపాలు జరిపారు.


ఐశ్వర్య వెంకటేశ్వరస్వామి ఆలయంలో అక్కారడిశల్ ప్రసాదం నివేదన

భీమునిపట్నం : పట్టణంలోని పలు ఆలయాల్లో కూడారై ఉత్సవం వైభవంగా నిర్వహించారు. కృష్ణా కాలనీ వెంకటగిరిపై పద్మావతి, గోదా సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధానార్చకుడు అప్పలాచార్యులు,మినీ స్టేడియం వద్ద ఉన్న ఐశ్వర్య వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధానార్చకుడు శేషాచార్యులు, మంగమారిపేట వారిజ ఆశ్రమంలో శ్రీలక్ష్మీ హయగ్రీవ మందిరంలో అర్చకుడు శ్రీకాంత్ శర్మ పర్యవేక్షణలో ఉత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో 108 గంగాళములతో అక్కారడిశల్ విశేష ప్రసాదమును గోదాదేవికి, స్వామివారికి నివేదించారు. అనంతరం మహిళలతోవిశేష కుంకుమార్చన నిర్వహించారు. ఈకార్యక్రమాల్లో గాడు అప్పలనాయుడు, కార్పొరేటర్ చిన్నికుమారిలక్ష్మి, కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, సూర్యనారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న భూమి స్వాధీనం

సింహాచలం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలోని వేపగుంట గ్రామానికి చెందిన సర్వే నంబరు 181లోని సుమారు 3.4 ఎకరాలు అప్పన్న దేవస్థానానికి చెందుతుందని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పు వెలవరించిందని ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. కోర్టు తీర్పు మేరకు దేవస్థానం అధికారులు ఇప్పటివరకు భూమి స్వాధీనంలో ఉన్న చల్లా వసంత, తదితరులకు నోటీసులు జారీ చేశారు. వారు స్పందించకపోవడంతో శనివారం ఆ స్థలాన్ని పోలీసుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఈఓ విలేకరులతో మాట్లాడుతూ సుమారు పదేళ్లకు పైగా కోర్టులో కేసు నడిచిందని, ఎట్టకేలకు దేవస్థానానికి అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. ప్రస్తుత మార్కెట్‌లో ఈ భూమి విలువ సుమారు రూ. 50 కోట్లకు పైగా ఉంటుందని చెప్పారు. స్వాధీనం చేసుకున్న భూమి చుట్టూ ఇనుప ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వాహక ఇంజినీర్లు డిజి శ్రీనివాసరాజు, బండారు రాంబాబు, డీఈఈ రామరాజు (హరి), పర్యవేక్షణాధికారి రమణరావు, సహాయ కార్యనిర్వాహణాధికారి రమణమూర్తి పాల్గొన్నారు.


తీర్పు ప్రతిని చూపుతున్న ఈఓ త్రినాథరావు

కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

కొమ్మాది, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 5వ వార్డులోని కొండవాలు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. శనివారం ఆమె కార్పెంటర్స్ కాలనీలో రోడ్డు, కాలువల మెట్ల మార్గాల పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సహకారంతో ఇప్పటికే కార్పెంటర్స్ కాలనీ, వికలాంగుల కాలనీ, స్వయంకృషినగర్ ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి సుమారు రూ.60 లక్షలతో పైపులైన్లు వేస్తున్నామని చెప్పారు. కొండవాలు ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, మెట్లు మార్గాలు వేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసి సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, వార్డు అధ్యక్షుడు నాగోతి వెంకట సత్యనారాయణ, నియోజకవర్గ బీసి సెల్ అధ్య క్షుడు నమ్మి శ్రీను, ప్రధాన కార్యదర్శి ఈగల రవికుమార్, పోతిన అప్పారావు, సూర్యశ్రావణి, సతీశ్ పాల్గొన్నారు.

గుడిలోవలో వైజ్ఞానిక ప్రదర్శన


వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకిస్తున్న అతిథులు

ఆనందపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుడిలోవ విజ్ఞాన విహార 45వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం సైన్స్, హ్యూమానిటీస్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు పలు అంశాలపై ప్రాజెక్టులు తయారు చేసి, ప్రద ర్శనలో ఉంచారు. ముఖ్యంగా అయోధ్యలోని బాలరాముడి ఆలయ నమూనా, ఆ వివరాలు, నిర్మాణ శైలిని పదవ తరగతి విద్యార్థులు ప్రదర్శించగా, అమరావతి, బౌద్ధ స్థూపం, వాఙ్మయం, చారిత్రక అంశాల నమూనాలు కూడా ఆకట్టుకున్నాయి.సుమారు 40 నమూనాలు సైన్స్‌కి సంబంధించినవి ప్రదర్శనలో ఉంచారు. 5 నుంచి 10వ తరగతి వరకు 500 మంది 80 రకాల నమూనాలు తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఏయూ ప్రొఫెసర్ గిరిజా శంకర్, ప్రిన్సిపాల్ బీవీ నారాయణరావు, సతీశ్ రామ్ చౌదరి, పాఠశాల సెక్రటరీ సుబ్రహ్మణ్యం, దూసి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

తిరు వెంకట ముడియాన్ అలంకరణలో అప్పన్న



సింహాచలం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జరుగుతున్న అధ్యయనోత్సవాల్లో అంతర్భాగమైన రాపత్తు ఉత్సవాల్లో భాగంగా శనివారం తిరు వెంకట ముడియాన్ (వెంకటేశ్వర స్వామి) అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. రెండు చేతుల్లో పాంచజన్యం, సుదర్శనం, కటిహస్తం, అభయ హస్తంతో ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఆలయ అలంకారి కరి సీతారామాచార్యులు భక్తులకు కనువిందుగా అలంకరించారు. స్వామివారిని ఉభయ దేవేరులతో పల్లకిలో అధిష్ఠింపజేసి ప్రధాన మాడవీధుల్లో తిరువీధి జరిపారు. మార్గం పొడవునా భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలిచ్చి ఆహ్వానం పలికారు. తిరువీధిలో స్వామివారి పల్లకిని దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు, దేవదాయశాఖ రాష్ట్ర కమిషనర్ ఎస్. సత్యనారాయణ మోసారు.



నిర్వాహకులతో మాట్లాడుతున్న వీఎంఆర్డీయే చైర్మన్ ప్రణవ్‌గోపాల్

బ్యాటరీ కార్ల నిర్వాహకులకు షోకాజ్ నోటీసులు : ప్రణవ్ గోపాల్

విశాలాక్షినగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కైలాసగిరిలో వీఎంఆర్డీయే చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కొండపై 'బ్యాటరీ కార్ల దోపిడీ' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శనివారం వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సందర్శకుల నుంచి బ్యాటరీ కార్ల నిర్వాహకులు వీఎంఆర్డీయే నిర్ధేశించిన ధర కంటే అధికంగా వసూలు చేస్తున్నందుకు షోకాజ్ నోటీసులు అందజేసినట్టు తెలిపారు.పర్యాటక ప్రాంతంలోని వ్యాపారులు నిర్ధేశించిన ధరల కంటే అధికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆయన పర్యాటకులతో ముచ్చటించారు. పారిశుధ్యం మెరుగుపరచాలని, తాగునీటి సదుపాయం కల్పించాలని సూచించారు. ఆయనతో పాటు జేసీ రమేశ్ ఉన్నారు.

వైభవంగా గోదాదేవి నీరాట్టోత్సవం


గోదాదేవికి అభిషేకాలు చేస్తున్న వైదికులు

సింహాచలం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై జరుగుతున్న ధారోత్సవాలు పురస్కరించుకుని పవిత్ర గంగధార వద్ద గోదాదేవి అమ్మవారికి నీరాట్టోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున ప్రభాతారాధనలు తరువాత ఉత్సవమూర్తిని గోదాదేవిగా అలంకరించి పల్లకిలో ఉంచారు. నాదస్వరాపనలు, వేదమంత్రాల నడుమ సింహగిరి మాడవీధిలో తిరువీధిగా అమ్మవారిని గంగధారకు తోడ్కొని వెళ్లారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఉంచి పండితులు చతుర్వేద మంత్రాల పారాయణలు చేస్తుండగా వైదికులు తొలుత పసుపును అమ్మవారికి అద్ది దానిపై పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం తిరుప్పావైలోని 28వ పాశురాన్ని విన్నవించారు.

మద్దిలో నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు

పద్మనాభం రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలని తెలుగు టైటాన్స్ సీఈవో త్రినాథరెడ్డి అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా శనివారం మద్ది గ్రామంలో ఎంపీపీ కె. రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భీమిలి నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజేతలకు 13న బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.


కారు షెడ్ కూడలి వద్ద బస్సులు కోసం వేచిఉన్న ప్రయాణికులు

ఎటు చూసినా..పండగ సందడి

- కిటకిటలాడుతున్న బస్టాప్‌లు
- ప్రయాణికులతో రద్దీగా వాహనాలు
- ఎక్కడికక్కడ స్తంభిస్తున్న ట్రాఫిక్

మధురవాడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతికి స్వగ్రామాలకు వెళుతున్న వారు బస్సుల కోసం పడిగాపులు పడుతున్నారు. మధురవాడ పరిసరాల్లో ఎక్కువగా శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన వారు నివసిస్తున్నారు. వారంతా కుటుంబాలతో పండుగకు స్వగ్రామాలకు ప్రయాణమవుతున్నారు. శనివారం కారుషెడ్ కూడలి, మధురవాడ, కొమ్మాది, ఎండాడ ప్రాంతాల్లో గంటల కొద్ది బస్సుల కోసం వేచి ఉన్నారు. బస్సులన్నీ నగరంలోని కాంప్లెక్సు నుంచి బయలుదేరడంతో అక్కడే నిండిపోతున్నాయి.మధురవాడ వచ్చేసరికి ఖాళీ లేకపోవడంతో కొందరు నిలబడి ప్రయాణాలు సాగిస్తున్నారు. జనం రద్దీని ప్రైవేటు వాహనదారులు సొమ్ము చేసుకుంటున్నారు. పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు, రాజాం, శ్రీకాకుళం, హిరమండలం, పూసపాటిరేగకు రెట్టింపు చార్జీలు వసూలు చేస్తున్నారు. దూర ప్రాంతాలకు తక్కువ సంఖ్యలో బస్సులు ఉండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అధికారులు అదనపు సర్వీసులు నడపాలని పలువురు కోరుతున్నారు.


కారు షెడ్ వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్

కారు షెడ్ వద్ద ట్రాఫిక్ జామ్

వాహనాల రద్దీ ఎక్కువ కావడంతో కారు షెడ్ జంక్షన్‌లో ఇబ్బందులు తలెత్తాయి. ముగ్గురు ట్రాఫిక్ పోలీసులు నియంత్రించినప్పటికీ వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. మిధిలాపురి వుడాకాలనీ రోడ్డు, కారుషెడ్, పోతినమల్లయ్యపాలెం ప్రాంతాల్లో ప్రైవేటు కళాశాలలు ఎక్కువగా ఉండడంతో విద్యార్థులను ఇళ్లకు తీసుకువెళ్లడానికి వారి తల్లిదండ్రులు కార్లు, బైక్‌లు, ఆటోలు తీసుకురావడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఒక దశలో పీఎంపాలెం హెచ్‌బీ కాలనీ వైపు సుమారు కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. అలాగే మిధిలాపురి వుడా కాలనీ రోడ్డు కూడా వాహనాలతో నిండిపోయింది.ఎట్టకేలకు పీఎం పాలెం ట్రాఫిక్ పోలీసులు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి జాతీ య రహదారితో పాటు సర్వీసు రోడ్లపై కూడా ట్రాఫిక్‌ను నియంత్రించడంతో కొంత వరకూ సమస్య పరిష్కారమైంది.

కిక్కిరిసిన రైళ్లు

... 5వ పేజీ తరువాయి

ఎక్స్‌ప్రెస్ రైళ్లు కూడా అలాగే వెళ్లాయి.

కిక్కిరిసిన పాసింజర్ రైళ్లు

విశాఖ నుంచి ఉత్తరాంధ్రలోని కొత్తవలస, విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, చీపురుపల్లి, పొందూరు, శ్రీకాకుళం రోడ్డు, తిలారు, కోటబొమ్మాళి, నౌపడా, పలాస, మందస, సోంపేట, ఇచ్ఛాపురం వంటి ప్రాంతాలకు వెళ్లేవారిలో అత్యధికులు రైళ్లను ఆశ్రయించాయి. దీంతో విశాఖ-భువనేశ్వర్ ఇంటర్‌సిటీ (22820), గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (17243) రైళ్లతో పాటు విశాఖ-భవానీపట్న (58504), విశాఖ-బ్రహ్మపూర్ (58532), విశాఖ-పార్వతీపురం పాసింజర్ (67287),విశాఖ-కోరాపుట్ (58538), విశాఖ-గునుపూర్ (58506),విశాఖ-రాయపూర్ (58528) పాసింజర్ రైళ్లు రద్దీగా నడిచాయి.

నేడు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు

విజయవాడ డివిజన్‌లో జరుగుతున్న నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో విశాఖ నుంచి గుంటూరు వెళ్లే సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240)ను ఆదివారం రద్దు చేయడంతో ఆ ప్రభావం జన్మభూమి (12805), రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12717)లపై పడే అవకాశం ఉంది. అయితే ఆదివారం ఉదయం 8.00 గంటలకు విశాఖ నుంచి చర్లపల్లికి ప్రత్యేక జన సాధారణ్ రైలు ప్రవేశపెట్టిన నేపథ్యంలో ప్రయాణికులకు కొంత ఊరట కలిగించే అవకాశాలు ఉన్నాయి.

ఉక్కులో వీఆర్ఎస్!

... 5వ పేజీ తరువాయి

సర్దుబాటు, ఉత్పత్తి వ్యయం తగ్గింపు, ఉత్పాదకత పెంపు కోసమే ఈ చర్యలు చేపడుతున్నామని వివరించింది. ప్రస్తుతం స్టీల్‌ప్లాంటులో 12,400 మంది ఉద్యోగులు ఉన్నారు. దీనిని పది వేల లోపునకు తేవాలనే లక్ష్యంతో యాజమాన్యం చర్యలు చేపడుతోంది.ఈఏడాది అంటే 2025లో డిసెంబరు నెలాఖరుకు 1,218 మంది పదవీ విరమణ చేస్తారు. ఇప్పుడు వీఆర్ఎస్‌తో వేయి మంది తగ్గిపోతారు. స్పందన అధికంగా ఉంటే...మరోసారి ప్రకటన ఇచ్చి మరికొంత మందిని తగ్గించే అవకాశం ఉంది.

వెళ్లిపోవాలనే ఆలోచనలో అత్యధికులు

విశాఖ స్టీల్‌ప్లాంటు చాలా ఇబ్బందుల్లో ఉంది. ప్లాంటును పూర్తిస్థాయిలో నడపడానికి అవసరమైన నిధులు లేవు. ముడి పదార్థాల కొరత ఉంది. కేంద్రం సాయం చేస్తామని మాటలు మాత్రమే చెబుతోంది.కనీసం జీతాలు కూడా ఇవ్వడం లేదు. ఉద్యోగులకు నాలుగు నెలలుగా జీతాలు లేవు. మొన్న దసరా, దీపావళి పండుగలకు జీతాలు ఇవ్వలేదు. ఇప్పుడు సంక్రాంతికి కూడా ఇవ్వలేదు. ఎప్పుడో ఇస్తారో కూడా చెప్పడం లేదు. అంటే యాజమాన్యానికి జీతాలు సక్రమంగా ఆలోచన లేదని ఉద్యోగులకు అర్థమైంది. మరోవైపు కాంట్రాక్టు కార్మికులను భారీగా తగ్గించడంతో అనేక విభాగాల్లో నిర్వహణ పనులు ఆగిపోయాయి. దాంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉత్పత్తికి ఆటంకం కలుగుతోంది. తక్కువ వనరులతో పూర్తి ఉత్పత్తితీయాలని ఒత్తిడి పెడుతున్నారు. అలా చేసినా జీతాలు ఇవ్వడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఇక్కడ పనిచేయడం కంటే ఎంత ఇస్తే అంత తీసుకొని బయటకు వెళ్లిపోవడమే మంచిదని అత్యధికులు భావిస్తున్నారు. ఇప్పటికే చాలామంది కుటుంబాలను పోషించుకోవడానికి రోజుకు మూడు నుంచి నాలుగు గంటలు డెలివరీ బాయ్స్‌గా పనిచేస్తున్నారు.

వీఆర్ఎస్ ప్రకటన విరమించుకోవాలి

... 5వ పేజీ తరువాయి

క్రూరమైన చర్య అన్నారు. స్టీల్‌ప్లాంటులో ఐదు వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని 2023లో పార్లమెంటులో కేంద్ర మంత్రి ప్రకటన చేశారని, తరువాత కాలంలో మరో రెండు వేల మంది పదవీ విరమణ చేశారని...మొత్తం ఏడు వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్న సమయంలో వీఆర్ఎస్ ప్రకటన చేయడం దుర్మార్గమన్నారు. వీఆర్ఎస్ తీసుకోవద్దని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. యాజమాన్యం ఇచ్చిన ఉత్తర్వులు ఉపసంహరించుకోకపోతే తీవ్రస్థాయిలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, పీవీ రమణమూర్తి, బీఎన్ రాజు, వరసాల శ్రీనివాసరావు, వి.ప్రసాద్, సురేష్‌బాబు, కామేశ్వరరావు పాల్గొన్నారు.

చుక్కల్లో విమాన టికెట్ల ధరలు

... 5వ పేజీ తరువాయి

ఎంచుకుంటున్నారు. మామూలు రోజుల్లో హైదరాబాద్ నుంచి విశాఖకు టిక్కెట్ ధర రూ.4 వేలలోపే ఉంటుంది. ఇప్పుడు రూ.15 వేల నుంచి రూ.17 వేలు చూపిస్తోంది. చెన్నై నుంచి విశాఖకు సాధారణ రోజుల్లో టిక్కెట్ ధర రూ.5 వేలలోపు ఉండగా ఇప్పుడు రూ.17 వేలు దాటి చూపిస్తోంది.

విజయవాడ విమానాలకు డిమాండ్

రాష్ట్ర రాజధాని విజయవాడ నుంచి విశాఖపట్నానికి మామూలు రోజుల్లో విమాన టిక్కెట్ ధర రూ.3 వేలు ఉండగా ఇప్పుడు అది రూ.7వేలకుపైనే చూపిస్తోంది.

'మా భూములను కాపాడండి'

సీతంపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : తమ భూములను కబ్జాదారుల నుంచి రక్షించి న్యాయం చేయాలని కోరుతూ భీమిలి మండలం రామయోగి అగ్రహారానికి చెందిన కోడూరు రామారావు, సంజీవరావు అభ్యర్థించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ వంశపారంపర్యంగా వస్తున్న తమ భూమిని ఆక్రమించడమే కాకుండా తమపై కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.నిడిగట్టు పంచాయతీ రామయోగి అగ్రహారం వద్ద భూమికి సంబంధించి 1బి, అండగల్ తమ పేరునే ఉన్నాయని, భీమునిపట్నం రెవెన్యూ విభాగంలో తమ పేరునే పుస్తకాలు ఉన్నాయని, అయినా ఎస్. చక్రవర్తి అనే వ్యాపారవేత్త తమ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నించి, దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయమై సీఎం, డిప్యూటీ సీఎం, హోంమంత్రికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు వారితో కుమ్మక్కై తమను వేధిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో బాధితుల కుటుంబ సభ్యులు శంకరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

బస్ కాంప్లెక్స్‌లలోనూ...

... 5వ పేజీ తరువాయి

కాకినాడ 30, భీమవరం 4, అమలాపురం 4 ప్రత్యేక సర్వీసులు నడిపారు. అలాగే జోన్ పరిధిలోని శ్రీకాకుళం 100, విజయనగరం 50, పార్వతీపురం 50, పాలకొండ 30, పలాస 50, టెక్కలి 20, సోంపేట 20, ఇచ్ఛాపురం 10 ప్రత్యేక సర్వీసులు ఆపరేట్ చేశారు. ప్రయాణికుల డిమాండ్ ఉంటే రాత్రికి కూడా ప్రత్యేక బస్సులు నడుపుతామని రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు ప్రకటించారు.ఆదివారం రద్దీకి తగ్గట్టుగా బస్సులు సమకూర్చుకుంటున్నామని ఆయన తెలిపారు.

స్వీట్ బాక్సులు పంపిణీ

తగరపువలస, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస పరిధిలో ఉన్న 50 మంది పారిశుధ్య కార్మికులకు ఫ్రెండ్స్ హెల్పింగ్ హేండ్స్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్వీట్ బాక్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఏయూకు రీసెర్చ్ ప్రాజెక్టు

... 5వ పేజీ తరువాయి

కాలేజీ పరిధిలోని వివిధ విభాగాలకు చెందిన పరిశోధకులకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడనుంది. గతంలో ఈ నిధులను డిపార్టుమెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నేరుగా యూనివర్సిటీలకు అందించేది. ఈ ఏడాది హబ్స్‌గా ఏర్పాటుచేసి వాటికి కేటాయిస్తోంది. పరిశోధనకు సంబంధించి యూనివర్సిటీల మధ్య ఆరోగ్యకరమైన పోటీని పెంచేందుకు ఈ విధానం దోహదపడుతుందని సీనియర్ ప్రొఫెసర్లు చెబుతున్నారు.

జోరుగా బెట్టింగ్

... 5వ పేజీ తరువాయి

తాము ఏమీ చేయలేమని సదరు ప్రజా ప్రతినిధికి టాస్క్‌ఫోర్స్ పోలీసులు సున్నితంగా చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది.మరొక ప్రజా ప్రతినిధి పీఏ ద్వారా ఒత్తిడి చేసినప్పటికీ పోలీసులు కేసు నమోదు చేయడంతో పాటు రవికుమార్‌ను అరెస్టు చేసినట్టు రికార్డుల్లో చూపించేశారు.మిగిలిన నలుగురు పరారీలో ఉన్నందున అరెస్టు చేయలేకపోయామం టూ పోలీసులు చెబుతున్నారు. కానీ ప్రజా ప్రతినిధుల నుంచి ఒత్తిళ్లు కారణంగానే పోలీ సులు వారి జోలికి వెళ్లడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ తరహా బుకీలు నగరంలో చాలామంది ఉన్నారని చెబుతున్నారు. బెట్టింగ్‌లపై స్థానిక పోలీస్ స్టేషన్‌లోని కొందరు సిబ్బందికి సమాచారం ఉంటుందని, అయితే బుకీలు ముందుగానే వారిని ప్రసన్నం చేసుకోవడంతో వారి జోలికి వెళ్లడం లేదని అంటున్నారు. పెదవాల్తేరులో పట్టుబడిన రవికుమార్ విషయానికి వస్తే, స్థానికంగా ఉన్న కొందరు పక్కా ఆధారాలతో నేరుగా సీపీకి ఫిర్యాదు చేయడం వల్లే అతను పట్టుబడ్డాడని, అదే స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తే, వారు ముందుగానే వారికి ఫోన్ చేసి అప్రమ త్తం చేసేవారని కొందరు అభిప్రాయపడుతున్నారు. పోలీస్ కమిషనర్ ఇప్పటికైనా బెట్టింగ్‌పై పూర్తిస్థాయిలో దృష్టిసారించి వీధివీధిన వెలసిన బుకీలకు ముకుతాడు వేయాలని పలువురు కోరుతున్నారు.

అప్రమత్తతతో చోరీల నియంత్రణ

- పండుగ నేపథ్యంలో ఆరిలోవ పోలీసుల విస్తృత ప్రచారం



బస్టాపు వద్ద కరపత్రాలు అందజేస్తున్న పోలీసులు

ఆరిలోవ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండగకు సొంతూరు వెళ్లేవారు ఇళ్లల్లో నగదు,విలువైన వస్తువులు ఉండరాదని ఆరిలోవ పోలీసులకు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై వారు శనివారం హనుమంతవాక జంక్షనులో కరపత్రాలు పంచి ప్రచారం చేశారు. ఊరు వెళుతున్న వారు పక్కింటి వారికి లేదా పోలీసులకు సమాచారం ఇస్తే చోరీల నియంత్రణకు అవకాశం ఉంటుందన్నారు. తమకు సమాచారం అందిస్తే ఇల్లు, పరిసర ప్రాంతాలపై నిఘా ఉంచుతామన్నారు. ఇంటికి తాళం వేసి కర్టెన్‌గా అడ్డుగా పెట్టాలన్నారు. బస్సు లేదా రైలులో ప్రయాణం చేసినపుడు అపరిచిత వ్యక్తులు ఇచ్చిన తిను బండారాలు తీసుకోకూడదని సూచించారు. అవసరమైతే క్రైం సీఐ సెల్ నంబరు 94906 24815, ఆరిలోవ పీఎస్ 70754 77887, క్రైం ఎస్‌ఐ 83310 41604కు ఫోన్ చేయవచ్చన్నారు.

అలరించిన గాత్ర కచేరీ



కీర్తనలు ఆలపిస్తున్న రఘునాథ

వెంకోజీపాలెం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఎంఎంటీసీ కాలనీలోని త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం నిర్వహించిన అన్నమాచార్య సంకీర్తనలు అలరించాయి. తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన గాయకులు, అన్నమాచార్య ప్రాజెక్టు ఏ గ్రేడ్ ఆర్టిస్ట్ రఘునాథ కీర్తనలను ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి ఎం.సావిత్రి, కోశాధికారి కె.సుబ్బారాయుడు, మేనేజరు బి.సన్యాసిరావు, శివరాం తదితరులు పాల్గొన్నారు.

నగర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

వెంకోజీపాలెం, జనవరి 11(ఆంధ్రజ్యోతి) : నగర ప్రజలకు నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలను తెలిపారు. ఈ సందర్భంగా వారు ఒక ప్రకటనలో విడుదల చేశారు. తెలుగువారుసంప్రదాయంగా నిర్వహించుకునే పండుగలలో భోగి, సంక్రాంతి, కనుమ పండుగలన్నారు. నగర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆనందంగా పండుగలను నిర్వహించుకోవాలని కోరారు.

సినిమా గైడ్

● **డాకు మహారాజ్ :** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, శారద, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ, శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 14, వంకాయలు (తెలుపు)30, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 56, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 46, బీరకాయలు 58, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 18, క్యారెట్ 40 దొండకాయలు 50, బంగాళ దుంపలు 26, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది)46, బరబాటి 52, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 340, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 80, కీరదోస 36, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడ దుంపలు 44, కంద 70, దేముడు చిక్కుడు 68, గోరు చిక్కుడు 34, ఆగాకార దేశవాళి 100, ఆగాకర హైబ్రిడ్ 100, కూర పెండలం 44, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 52, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 34, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	102
లైవ్ ధర	122
విత్ స్కిన్	214
స్కిన్‌లెస్	224

ఊరెళ్తున్నారా.. ఇల్లు భద్రం

- లాకర్లలో విలువైన వస్తువులు
- తలుపులన్నీ మూసి తాళాలు వేయాలి
- పోలీసుల సూచనలు



మద్దిలపాలెం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సెలవులు వచ్చాయి. సొంత ఊర్లకు బయలుదేరుతున్నారు. సెలవులకు సరదాగా ఇతర ప్రాంతాలకు వెళుతుంటారు. ఆ నేపథ్యంలో ఊర్లకు వేరే వారు ఇంటి భద్రతపై జాగ్రత్తలు పాటించాలని నేర విభాగం పోలీసులు సూచిస్తున్నారు. ఇంటిలో ఎవరు లేనప్పుడే దొంగలు తమ చేతివాటం ప్రదర్శిస్తారు. అంతేకాకుండా చలికాలం దొంగలకు అనుకూలించే సమయం. చలి తీవ్రతకు, పొగమంచుకు అర్ధరాత్రుళ్లు అలికిడి కూడా ఉండదు. ఊరెళ్లేవారు ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా సొత్తు మాయమవడం ఖాయం.

నగరంలో ఇరానీ, చెడ్డీ ఇలా దొంగల గ్యాంగ్‌లు చోరీలకు పాల్పడుతున్న సంఘటనలు తెలిసిందే. పెద్ద పండుగ సంక్రాంతికి ఇంటికి తాళాలు పడితే వాటినే లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉంది. ఉదయం తాళాలు వేసిన ఇళ్లను గుర్తించి రాత్రికి దొంగతనాలకు పాల్పడుతుంటారు. అందుకే పోలీసులు చేసిన సూచనలు తప్పనిసరిగా పాటించాలి.

ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌తో పోలీస్ భద్రత

ఇంటి దొంగతనాలు అరికట్టడానికి ఏపీ పోలీస్ శాఖ ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ రూపొందించింది. ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని చిరునామా, ఫోన్ నంబర్ నమోదు చేసి లాగిన్ అవ్వాలి. అనంతరం రిక్వెస్ట్ పోలీస్ వాచ్ ఆప్షన్ ఎంచుకోవాలి. దీంతో వినియోగదారుడు అందించిన సమాచారంతో పోలీసులు అతని చిరునామాలో వైఫై రూటర్,సెన్సార్‌తో పని చేసే మోషన్ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తారు. తాళం వేసిన ఇంటిలోకి అపరిచితులు ప్రవేశించడానికి ప్రయత్నిస్తే సెన్సార్ ద్వారా ఫొటోలు తీయడమే కాకుండా అలారం ద్వారా కంట్రోల్ రూమ్ పోలీసులకు అప్రమత్తం చేస్తుంది. నిమిషాల వ్యవధిలోనే పోలీసులు అక్కడకు చేరుకుని దొంగలను పట్టుకుంటారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఊరెళ్లే సమయంలో ఇంట్లో విలువైన వస్తువులు, నగదు పెట్టకూడదు, బీరువాల్లో అసలే ఉంచకూడదు. వీలైతే బ్యాంక్ లాకర్లలో భద్రపరచాలి. ఇంటి తలుపులు, కిటికీలు అన్నీ మూసి తాళాలు వేయాలి.
- ముందు తలుపులకు సెంటర్ లాక్ వేసి బయట గొళ్లెం పెట్టకపోవడం మంచిది. ద్వారం వద్ద చెప్పులు కూడా పెడితే ఇంట్లో మనుషులు ఉన్నట్టే దొంగలు భావిస్తారు.
- సెంటర్ లాక్ లేని వారు గొళ్లేనికి తాళం వేసి అది కనిపించకుండా డోర్ కటన్‌తో కవర్ చేయాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్న వారు నిత్యం కెమెరాలో వీక్షిస్తుండాలి.
- ఊరికి వెళ్లిన వారు తమ పరిధి పోలీసులు, సమీప నివాసులకు సమాచారమిచ్చి తమ ఇంటిని ఓ కంట కనిపెట్టామని చెప్పాలి. ఇంట్లో లైట్లు వెలిగించి ఊరు వెళ్లడం ఉత్తమం.
- ఇళ్లు, బీరువా తాళాలు పనిమనుషులకు ఇవ్వకూడదు.

గస్తీ పెంచాం



సంక్రాంతి సెలవులు నేపథ్యంలో ఈస్ట్ సబ్ డివిజన్‌లో గస్తీ పెంచాము ఊర్లకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం అందించడం ద్వారా వారి నివాసాలపై దృష్టిపెడతాము. అలాగే విలువైన వస్తువులు బ్యాంక్ లాకర్లలో భద్రపరచాలి. ప్రజలు బాధ్యతగా వ్యవహరించి పోలీసులకు సహకరిస్తే దొంగతనాలు అరికట్టడంలో మరింత మెరుగైన ఫలితాలు వస్తాయి. దొంగతనాల నియంత్రణకు రూపొందించిన ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని లాగిన్ అవడం ద్వారా మరిన్ని సేవలు కల్పిస్తాం.

- ఎర్రంనాయుడు, సీఐ, ఈస్ట్ సబ్ డివిజన్ క్రైం



హనుమంతవాకలో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

పండుగ కోసం పల్లెకు జనం

ఆరిలోవ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఈ ప్రాంతంలో ఉన్న ఇతర ప్రాంతాలకు చెందిన వారు వారి సొంత ఊర్ల బాట పట్టారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో వీరంతా సొంత వాహనాలు, బస్సులు, ఇతర రవాణా సదుపాలయాల ద్వారా పిల్లాపాపలతో ఊర్ల బాట పట్టారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా శ్రీకాకుళం, విజయనగరం, గోదావరి జిల్లాలకు చెందిన వారు ఎక్కువగా ఉంటారు. వీరంతా పండుగ వేళ తమ గ్రామాలకు తరలి వెళ్లి తమ వారిని చూసి వస్తారు. అలాగే పండుగ వేళ ఉద్యోగాలు, ఉపాధి కోసం ఇతర నగరాల్లో స్థిరపడిన వారంతా సొంత గ్రామాలకు వస్తారు. దీంతో బంధుమిత్రులనే కాకుండా, చిన్న నాటి స్నేహితులను కలిసేందుకు సంక్రాంతి పండుగ ఓ మంచి సందర్భంగా భావిస్తారు. పల్లెల్లో గడిపి రావడం ఓ మధురానుభూతిగా ఉంటుంది. మన అనుకున్న వారందరినీ కలిసి, మాట్లాడి వస్తే ఆ ఆనందమే వేరు అంటారంతా. అందుకే పండుగ నేపథ్యంలో స్వగ్రామాలకు బయలుదేరుతున్నారు. దీంతో ప్రయాణికుల రవాణా వాహనాలు రద్దీగా ఉంటున్నాయి. దీంతో బస్టాండ్‌లు రద్దీగా ఉంటున్నాయి.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర అమోఘం

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్



పోటీలను ప్రారంభోత్సవంలో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు

సిరిపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సమాజాబివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిదని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం ఈస్ట్‌పాయింట్ గోల్ఫ్ లేడీస్ కమిటీ, సన్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో లేడీస్ గోల్ఫ్ కప్-2025 పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు గోల్ఫ్ కోర్టులో ప్రతిభను చాటాలన్నారు. క్రీడల ద్వారా మరింత ఉత్సాహంగా రాణించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. సన్ సీఎండీ శ్రీకాంత్ జాస్తి మాట్లాడుతూ పోటీల ద్వారా మహిళల్లో ఉన్న ప్రతిభను వెలికితీసే అవకాశం కలుగుతుందన్నారు. సన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశా జాస్తి మాట్లాడుతూ మహిళలు శక్తిగా ఉంటేనే ఆయా కుటుంబాలు దృఢంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో లేడీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహా నిర్లక్ష్యం

- 12వ వార్డులో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు

ఆరిలోవ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఒకరిని చూసి మరొకరు అలాంటి నిర్మాణాలు చేపడుతున్నారు. ముఖ్యంగా.. ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న వారు యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. దీనివల్ల ప్రమాదం అని తెలిసినా పట్టించుకోవడం లేదు. స్థానిక సూర్యతేజనగర్‌లో విద్యుత్ స్తంభానికి అతి దగ్గరగా రెండు అంతస్థుల భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ భవనాన్ని చూసిన వారంతా ముక్కున వేలేసుకుంటున్నారు.విద్యుత్ స్తంభానికి ఉన్న వైర్లు భవనం ముందు వైపునకు అతి దగ్గరగా ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో భవనం పైకి వెళ్లినప్పుడు ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదం సంభవించే పరిస్థితి ఉంది. మరి ఇలాంటి భవనాలకు జీవీఎంసీ ఎలా అనుమతులు ఇస్తుందో అర్థం కావడం లేదని స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ ప్లాన్ అనుమతి పొందిన తర్వాత నిర్మాణదారులు తమప్లాన్ ప్రకారం నిర్మాణాలు చేపడుతుంటే వెంటనే అడ్డుకోవడమైనా చేయాలని అంటున్నారు. కానీ, అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.



విద్యుత్ తీగలకు సమీపంగా సూర్యతేజనగర్‌లో నిర్మిస్తున్న భవనం



ఉత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

కన్నుల పండువగా కూడారై ఉత్సవం

వెంకోజీపాలెం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఎంఎంటీసీ త్రిమూర్తిక ఆలయంలో చేపట్టిన నీరాట్టం ఉత్సవాల్లో గోదాదేవికి శనివారం కుడారై ఉత్సవం జరిపారు. తెల్లవారు జాము 5:30 గంటలకు అమ్మవారికి అర్చన, కుంకుమాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు.



కొత్త వెంకోజీపాలెం వైభవ వేంకటేశ్వరస్వామికి పూజలు

అనంతరం అర్చకులు వెంకటరమణాచార్యులు, గోపాలకృష్ణ, వంశీకృష్ణల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తయారు చేసిన కుడారై ప్రసాదాన్ని అమ్మవారికి సమర్పించి, ఉత్సవాన్ని కొనసాగించారు. వేద మంత్రాలతో అమ్మవారికి పూజలు నిర్వహించి, కుడారై ప్రసాదాన్ని భక్తులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి ఎం.సావిత్రి, కోశాధికారి కె.సుబ్బారాయుడు, మేనేజర్ సన్యాసిరావు, శివరాం తదితరులు పాల్గొన్నారు.

అలాగే కొత్త వెంకోజీపాలెంలోని కోదండరామాలయంలో వేంచేసి ఉన్న వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ కుడారై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని గోదా అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ అర్చకులు కిషోర్‌శర్మ భక్తుల పేరిట అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం అధ్యక్షులు పీల కనకరాజు, ఇతర కార్యవర్గ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నీతి ఆయోగ్ ప్రగతి చోదకాలపై చర్చ



జ్ఞాపికను అందజేస్తున్న వీఎంఆర్‌డీ చైర్మన్ ప్రణవ గోపాల్. పక్కన కమిషనర్ విశ్వనాథన్, జాయింట్ కమిషనర్ రమేశ్

విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం రీజియన్‌ను గ్రోత్ హబ్ (ప్రగతి చోదకం)గా అభివృద్ధి చేయడానికి చేపట్టాల్సిన చర్యలపై వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో శనివారం సమావేశం జరిగింది. గతమూడు రోజులుగా జరుగుతున్న ఈ సమావేశాల్లో శనివారం పర్యాటక రంగం అభివృద్ధిపై చర్చ నిర్వహించారు. దీనికి నీతి ఆయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బీవీఆర్ సుబ్రహ్మణ్యంహాజరై పలు సూచనలు చేశారు. సమావేశం అనంతరం సుబ్రహ్మణ్యంను వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్,జాయింట్ కమిషనర్ రమేశ్ పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో ద్వాదశ పూజలు



వెంకోజీపాలెం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠ ద్వాదశి శనివారం కావడంతో వైష్ణవ ఆల యాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఎంఎంటీసీ కాలనీలోని త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయం లో స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వార దర్శనానికి వీలుకాని వారంతా ద్వాదశి రోజున దర్శించుకుంటారు.

రంగవల్లికల పోటీలు

ఎంవీపీ కాలనీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీసత్యసాయి ప్రేమసదన్ మందిరంలో శనివారం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. శ్రీసత్యసాయి సేవా సమితి విశాఖ సిటీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో బాల వికాస్ చిన్నారులు, బాల వికాస్ తల్లిదండ్రులు, బాల వికాస్ గురువులు పాల్గొన్నారు. సత్యసాయి బాలవికాస్, సత్యసాయి మహిళా విభాగం పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

నిత్యావసర సామగ్రి అందజేత



సామగ్రి అందజేస్తున్న కనకరాజు

రామ్‌నగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మృతి చెందిన తెలుగు మహిళా కార్యకర్త షేక్ అమ్మాజీ కుటుంబానికి టీడీపీ 28వ వార్డు ఇన్‌చార్జి నక్కా కనకరాజు ఆధ్వర్యంలో నాయకులు శనివారం నిత్యావసర సామగ్రి అందజేశారు.

జీవీఎంసీలో ఘనంగా వడ్డే ఓబన్న జయంతి వేడుకలు



ఓబన్నకు నివాళి అర్పిస్తున్న ఏడీసీ రమణమూర్తి, అధికారులు

వెంకోజీపాలెం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : భయం ఎరుగని వడ్డేర్లు, బోయలు, చెంచులతో కూడిన సంచార తెగల సైన్యాన్ని, సమర్థవంతంగా నడిపించి, దట్టమైన నల్లమల అడవుల్లో సైతం, కుంపనీ సైన్యాన్ని ఊచకోత కోసం ఉరుకులు పెట్టించడంలో ముఖ్య పాత్ర పోషించినవీరుడు వడ్డే ఓబన్న అని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి పేర్కొన్నారు. శనివారం వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో పలువురు అధికారులతో కలిసి ఓబన్న చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర వేడుకగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఓబన్న సంచార జాతి వడ్డెర కులానికి చెందిన వారని, బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ అధీన సమయంలో రేనాటి పాలేగాళ్లకు అధికారాన్ని, కుంపనీకి ఇచ్చినందుకు పాలెగాళ్లకు ఇచ్చే భత్యం విషయంలో ప్రారంభమైన ఘర్షణలు, క్రమేపి సాయుధ పోరాటాలుగా మారాయన్నారు. నొస్సం పాలెగాడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయుధ పోరుతో సైన్యాధ్యక్షుడిగా వడ్డే ఓబన్న పోషించిన వీరోచిత పాత్రను, చరిత్రలో తక్కువ చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు నరసింహారెడ్డి ముఖ్య అనుచరుడిగా, తన నాయకుడిని, అతని కుటుంబాన్ని కూడా కాపాడటంలో ముఖ్య పాత్ర పోషించారనా నరు. ఓబన్న వీరత్వాన్ని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఐఐఏఎంలో సంక్రాంతి సంబరాలు



ఎంవీపీ కాలనీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఐఐఏఎం బిజినెస్ కళాశాలలో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు ఉల్లాసంగా భోగి మంటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజ్‌మాతాజ్ సీఈవో డాక్టర్ మీనాక్షీ అనంతరాం పాల్గొని ప్రసంగించారు. ఐఏఎం డైరెక్టర్ డాక్టర్ సుంకరి రవీంద్ర, సమతా కళాశాల డైరక్టర్ డాక్టర్ విజయా రవీంద్ర, జాయింట్ డైరక్టర్ డాక్టర్ పి శివకుమార్ పాల్గొన్నారు.

ధనుర్మాసన పూజల్లో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఆరిలోవ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆఖరి బస్టాపు సమీపంలో గల ఆలయంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో శనివారం జనసేన పార్టీ నగర అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజల చేశారు. ఈ సందర్భంగా గెడ్డం మురళి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు సత్కరించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో వంశీకృష్ణ శ్రీనివాస్ యువసేన అధ్యక్షుడు దూలి రఘు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

కళలు.. సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీక



నృత్య ప్రదర్శన ఇస్తున్న బాలికలు

సిరిపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : భారతీయ కళలు మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని శ్రీపాండురంగస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ మట్టపల్లి హనుమంతరావు అన్నారు. శనివారం ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా సిరిపురం డౌన్‌లో ఉన్న దేవస్థానం ప్రాంగణంలో నాట్యం స్కూల్ ఆఫ్ కూచిపూడి ఆధ్వర్యంలో వైభవోత్సవాన్ని నిర్వహించారు. పారిశ్రామికవేత్త కె.కుమార్‌రాజా జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాకారులు ప్రదర్శించిన శ్రీవేంకటేశ్వర కల్యాణం నృత్యరూపకం,గోదాదేవి అమ్మవారి తిరుప్పావై వైభవం ఆకట్టుకునేలా సాగింది. అతిథుల చేతులమీదుగా కళాకారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ సభాధ్యక్షులుగా వ్యవహరించగా, ఈవో ఎ.దేవుళ్ళు, నాట్యగురువు భానురేఖ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న మాజీ మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్సీ కల్యాణి, పలువురు మాజీ ఎమ్మెల్యేలు, రమణికుమారి తదితరులు

మద్దిలపాలెం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెంలోని వైసీపీ నగర కార్యాలయంలో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు, చెరుకుగడల పందిళ్లతో సందడి చేశారు. ముగ్గులు వేసి సంక్రాంతి శోభను తీసుకొచ్చారు. మహిళా విభాగం ఆధ్వర్యంలో పార్టీ మహిళ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని సంక్రాంతి సంప్రదాయాలతో పండుగ జరిపారు.

ఈ వేడుకలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అందరికీ భోగభాగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పల గురుమూర్తి, చింతలపూడి వెంకట్రామయ్య, తైనాల విజయకుమార్, నాయకులు రవిరెడ్డి, జహీర్ అహ్మద్, మొల్లి అప్పారావు, పేడాడ రమణికుమారి తదితరులు పాల్గొన్నారు.

ఊళ్లకు వెళ్తున్నారా.. జాగ్రత్త



పోస్టరును ఆవిష్కరిస్తున్న ఏసీపీ లక్ష్మణరావు, సీఐ, ఎస్‌ఐలు

కంచరపాలెం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ నేపథ్యంలో సొంత ఊళ్లకు వెళ్లేవారు దొంగతనాల నివారణకు పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని వెస్ట్ క్రైం ఏసీపీ లక్ష్మణరావు సూచించారు. పాటించాల్సిన మెలకువలను వివరించే పోస్టరును శనివారం కంచరపాలెం క్రైం స్టేషన్‌లో ఆవిష్కరించారు. ఇంటికి తాళం వేసి ఊళ్లకు వెళ్లేవారు పక్కింటి వారికి, స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. అపార్టుమెంట్ నివాసితులు విధిగా సీసీ కెమెరాలు, వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొత్తవారు, అపరిచితులు సంచరిస్తే వారి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ఏటీఎం పిన్ నెంబర్‌ను ఎవరికీ చెప్పరాదని తెలిపారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐలు సుదర్శన్‌రావు, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

21న ధర్మారావుకు తెలుగు కీర్తి పురస్కారం



ధర్మారావు

అక్కయ్యపాలెం, జనవరి 11 (ఆంధ్ర జ్యోతి): గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఎంపీ ధర్మారావు తెలుగు కీర్తి జాతీయ ప్రతిభ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నెల 21న విజయవాడలో జరగనున్న జాతీయ పురస్కారాల ప్రదానోత్సవంలో ఈ పురస్కారాన్ని అందుకుంటారు. తెలుగు సాహిత్యం, సాంస్కృతిక కళా ప్రక్రియలు, వివిధ రంగాల్లో సేవలందించిన ప్రతిభావంతులు, సాహితీమూర్తులకు, కళాకారులకు ఏటా శ్రీశ్రీ కళావేదిక సీఈవో కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమంలో తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాలు అందజేస్తోంది. ఈ పురస్కారానికి ధర్మారావు ఎంపిక కావడం పట్ల హెచ్ఎం బి.లక్ష్మీనరస, సహోపాధ్యాయులు అభినందించారు.

'తిరుపతి ఘటనపై రాజకీయం తగదు'

సీతంపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి దుర్ఘటనలో విశాఖవాసులు నలుగురు మృతిచెందడం దురదృష్టకరమని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఘటనపై వైసీపీ నాయకులు రాజకీయాలు చేయడం తగదన్నారు. సీఎం, డిప్యూటీ సీఎంలు బాధిత కుటుంబాలకు అండగా ఉన్నారన్నారు. మాజీ మంత్రులు బొత్స, అమర్‌నాద్, రోజాల వ్యాఖ్యలు విచారకరమన్నారు. వారి వ్యాఖ్యల వెనుక కుట్ర ఉందన్నారు.

'మా భూములను కాపాడి న్యాయం చేయండి'

సీతంపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తమ భూములను కబ్జాదారుల నుంచి రక్షించి న్యాయం చేయాలని కోరుతూ భీమిలి మండలం రామయోగి అగ్రహారానికి చెందిన కోడూరు రామారావు, సంజీవరావులు అభ్యర్థించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ వంశ పారంపర్యంగా వస్తున్న తమ భూమిని ఆక్రమించడమే కాకుండా తమపైనే కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిడిగట్టు పంచాయతీ రామయోగి అగ్రహారం వద్ద భూమికి సంబంధించి 1బి, అండగల్ తమ పేరునే ఉన్నాయని, భీమునిపట్నం రెవెన్యూ విభాగంలో తమ పేరునే పుస్తకాలు ఉన్నాయని, అయినా ఎస్.చక్రవర్తి అనే వ్యాపారవేత్త తమ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నించి, దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయమై సీఎం, డిప్యూటీ సీఎం, హోంమంత్రికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు వారితో కుమ్మక్కై తమను వేధిస్తున్నారన్నారు. సమావేశంలో బాధితుల కుటుంబ సభ్యులు శంకరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

తిక్కవానిపాలెం కాలనీ గ్రామ నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

కంచరపాలెం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 47వ వార్డు తిక్కవానిపాలెం కాలనీ గ్రామ కమిటీ ఎన్నిక శనివారం జరిగింది. గ్రామ పెద్ద గరికిన పరసయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలో గ్రామాధ్యక్షుడిగా గనగళ్ల శంకర్, ఉపాధ్యక్షుడిగా కోలా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా లుట్ట శివకుమార్, కార్యదర్శిగా కోడ ధనశేఖర్, సహాయ కార్యదర్శిగా గరికిన అప్పారావు, కోశాధికారిగా మద్దు శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వానపల్లి అప్పన్న, వంకా అప్పారావు, ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన సభ్యులు గ్రామ అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. వీరికి గ్రామ పెద్దలు, స్థానికులు శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



కేజీహెచ్‌లో నర్సింగ్ సిబ్బంది వేసిన ముగ్గులు పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, తదితరులు



శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో సంక్రాంతి సంబరాల్లో భాగంగా హరిదాసును ఆసక్తికరంగా చూస్తున్న వివిధ వేషధారణలలో ఉన్న చిన్నారులు

మహారాణిపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా కేజీహెచ్‌లో రంగవల్లుల పోటీ ఉత్సాహంగా నిర్వహించారు. కేజీహెచ్ నర్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు, హెడ్ నర్సులు, వివిధ విభాగాల వారు 14 బృందాలుగా ఏర్పడి సంక్రాంతి ముగ్గులను రంగులతో తీర్చిదిద్దారు. నిత్యం రోగులకు సేవలందిస్తూ తీవ్ర ఒత్తిడిలో ఉండే ఈ సిబ్బంది సంక్రాంతి ముగ్గులు పోటాపోటీగా వేసి మానసిక ఉపశమనం పొందారు. చూపరులను ఈ ముగ్గులు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది ముగ్గులను పరిశీలించారు. న్యాయనిర్ణేతలు నియమించిన డాక్టర్ వాసవి లతా, డాక్టర్ ఐ.వాణి, సర్జరీలు, కార్డియోథొరాసిక్, ఆర్థో విభాగాలను విజేతలుగా ప్రకటించారు. విజేతలకు సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ మెహర్‌కుమార్, నర్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు టి.గంగాభవాని, ప్రతినిధులు పిట్టా వరలక్ష్మి, డి.లక్ష్మి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలోని శ్రీ ప్రకాష్ విద్యానికేతన్‌లో శనివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు కన్నుల పండువగా జరిగాయి. సంబరాల్లో భాగంగా పాఠశాల ఆవరణ రంగుల రంగ వల్లులతో మెరిసిపోయింది. నిలువెత్తు భోగీ మంటలు ఆకట్టుకున్నాయి. పెద్దల ఆశీర్వచనాలతో చిన్నారులకు భోగీపళ్ల వేయడం, గొబ్బెమ్మల చుట్టూ తిరుగుతూ కన్నెపడుచులు చేసిన నృత్యాలు, హరిదాసుల కీర్తనలు, కొమ్మదాసరుల దీవెనలు, నింగిలో గాలిపటాల రెపరెపలు, డూ డూ బసవన్నల ప్రదర్శన, భోగీ, మకర సంక్రాంతి, కనుమ పండుగల విశిష్టత తెలిపే బుర్రకథ, గోదాదేవి కల్యాణం, నృత్య రూపకం, బొమ్మల కొలువుతో పాఠశాల ఆవరణ కళకళళాడింది. వివిధ రకాల పిండి వంటలతో కూడిన స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. విద్యార్థులు గాలిపటాలు తయారు చేసి ప్రదర్శించారు. వారి తల్లులకు రంగోలి పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో పాఠశాల ఆవరణ కనువిందు చేసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చిట్టూరి వాసుప్రకాష్ పాల్గొని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

అక్కయ్యపాలెం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ సందర్భంగా 44వ వార్డు అబిద్‌నగర్‌లో ఉషోదయ చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ కొయిలాడ నవ్య ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ముగ్గుల పోటీ నిర్వహించారు. సుమారు 20 మంది మహిళలు పాల్గొని వివిధ అంశాలపై ముగ్గులు వేశారు. వీటిలో రెండింటిని ఎంపిక చేశారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి సంధ్య, ద్వితీయ బహుమతి దివ్యలు గెలుచుకున్నారు.



అబిద్‌నగర్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు

'గీతలు-రాతలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మేడ మస్తాన్‌రెడ్డి తదితరులు

సీతంపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కార్టూనిస్ట్ వందన శ్రీనివాస్ విరచిత గీతలు-రాతలు పుస్తకాన్ని రచయిత మేడా మస్తాన్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సరస్వతీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ పుస్తక శీర్షికను విశ్లేషించారు. సీహెచ్ చిన సూర్యనారాయణ పుస్తకాన్ని సమీక్షించారు. రచయితలు, సంపాదకులు, సాహితీవేత్తలు కేవీ మోహన్‌రావు, శిరేల సన్యాసిరావు, పీవీ రామశర్మ, డాక్టర్ డీవీ సూర్యారావులు పుస్తక విశేషాలను వివరించారు. రచయిత వందన శ్రీనివాస్ తన స్పందన తెలిపారు. ఈ కార్యక్రమంలో సునర్ల సర్వేశ్వరరావు, పి.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమాజ హితమే సాహితీ ప్రవంతి ధ్యేయం

కంచరపాలెం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సమాజహితమే సాహితీ ప్రవంతి ధ్యేయమని ఈ సంస్థ విశాఖ జిల్లా అధ్యక్షుడు పొలమరశెట్టి ఫ్రాన్సిస్ పేర్కొన్నారు. స్థానిక బీఎస్ఆర్ భవనంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అందరినీ కలుపుకొని సమాజ హిత కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం తెలుగు భాష గొప్పదనం, కథా కవితా సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా.కె.వి.రమణ, ఎం.ఆనంద్ శర్మ, కె.భాస్కరరావు, కె.ఎర్నికుమార్, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వస్త్రాలు



వస్త్రాలు అందజేస్తున్న జోనల్ కమిషనర్ రాము

మురళీనగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వేడుకలను పురస్కరించుకుని మురళీనగర్ సుదర్శన్ పార్కులో శనివారం పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు, మిఠాయిలు అందజేశారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ అధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. జోన్-5 జీవీఎంసీ పరిధిలోని 49, 50 వార్డుల్లో పనిచేస్తున్న పారిశుధ్య పర్యవేక్షకులు, కార్మికులకు సంక్రాంతి కానుకల్ని అందజేశారు. కార్యక్రమానికి హాజరైన జోన్-5 జెడ్సీ బి.రాము ద్వారా కార్మికులకు ఈ కానుకల్ని పంపిణీ చేశారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి శంకరనారాయణ, ప్రముఖ న్యాయవాది పృథ్వీరాజ్, ఎం.ఆర్.కె.రంగారావు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమంతోనే స్టీల్‌ప్లాంటును కాపాడుకుంటాం

» జేఏసీ ప్రతినిధులు స్పష్టీకరణ



సంఘీభావం తెలుపుతున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు

సీతంపేట, జనవరి 11, (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పర్యటనకు వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్టీల్‌ప్లాంట్ కోసం మాట్లాడకపోవటాన్ని చూస్తే దీని మూసివేతకే ఆలోచిస్తున్నట్లు స్పష్టమవుతోందని జేఏసీ ప్రతినిధులు అన్నారు. కూటమి ప్రభుత్వానికి సారథ్యం వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు ప్రధాని పాల్గొంటున్న విశాఖ సభలో స్టీల్‌ప్లాంట్ విషయం కనీస ప్రస్తావనకు తీసుకురాకపోవడం ఉద్యోగులను ఆశ్చర్యాన్ని కలుగచేస్తుందని వారు పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నిలబెట్టుకోవడానికి జేఏసీ కృషి చేస్తుందన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం బీసీ సమన్వయ కమిటీ జిల్లా ఛైర్మన్ కట్టా మల్లేశ్వరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కమిటీ కో కన్వీనర్ లకే రాజారావు, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కమిటీ సభ్యులు, బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పెదపెంకి శివప్రసాద్, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, సామాజిక రచయిత డాక్టర్ తెన్నేటి జయరాజ్ తదితరులు పోరాటానికి సంఘీభావం తెలిపారు. ఎన్నికల వాగ్దానాన్ని మరచి వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్పడానికి విశాఖ ప్రజలు సిద్ధం కావాలని కోరుతున్నామన్నారు. ప్రజా ఉద్యమం ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అదే ఉద్యమంతో కాపాడుకోవాలని జేఏసీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రజలను భాగస్వాములను చేస్తామన్నారు. ఈ సమావేశంలో రామారావు దొర అల్లూరు, బాగం గోపాలరావు, కనికెళ్లి వరలక్ష్మి, ఎం.అన్వేష్ పాల్గొన్నారు.

పోషకాహారంతో రోగ నిరోధక శక్తి పెంపు

మహారాణిపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో మధుమేహం, అధిక కొవ్వు, ఊబకాయం వంటి జీవన శైలి వ్యాధులు ప్రబలుతున్నందున ఆహార ఎంపిక పట్ల జాగ్రత్తలు పాటించాలని ప్రముఖ న్యూట్రీషియన్ పి.కృష్ణ సూచించారు. శనివారం మహారాణిపేటలోని ఓ సమావేశమందిరంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రీషన్ ప్రచురించిన 'మంచి ఆరోగ్యం-భారతీయులు-ఆహార మార్గదర్శకాలు' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారీ ఆహారంలో ఆరోగ్యకరమైన పోషక విలువలు ఉన్న పీచు (ఫైబర్) పదార్థాలతో గుండె ఆరోగ్యం, రక్తంలో చక్కెర నియంత్రణ జరుగుతుందని, తద్వారా రోగనిరోధక శక్తి పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు. పండ్లు, ఆకుకూరలు, రోజూ తినగలిగే బాదం వంటి పప్పుదినుసులు, అవిస గింజలు వంటి వాటిని తీసుకోవటం ద్వారా ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్లు వంటి ముఖ్యమైన పోషకాలు శరీరానికి అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైశాఖీ పార్కులో వేడుకలు రేపు

మురళీనగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కులో ఈ నెల 13న భోగీ సంబరాలు ఘనంగా నిర్వహించనున్నారు. మురళీనగర్, మాధవధార ప్రాంత వాసులు, క్లబ్ సభ్యులను ఆహ్వానించారు. ఉదయం 5 గంటల నుంచి పార్కు ఆవరణలో భోగీ మంటలతో వేడుకల్ని ఆరంభించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు వరప్రసాద్ తెలిపారు. సంప్రదాయ వస్త్రధారణలు, పులివేషాలు, హరిదాసు సంకీర్తనల నడుమ పార్కు ప్రాంగణంలో వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అందరూ ఈ వేడుకలకు హాజరు కావాలని కోరారు.

డివైడర్ల తొలగింపుతో పోలీసులు గుర్రు



దసపల్లా వద్ద ఇంజనీరింగ్ అధికారులు డివైడర్లను తొలగించింది ఇక్కడే

జగదాంబ కూడలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): లేపాక్షి మెయిన్ రోడ్డు కూడలి వద్ద వాచ్‌హౌస్ నుంచి శివాలయం వైపు డివైడర్లను జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు శుక్రవారం అర్ధరాత్రి తొలగించడం వివాదాస్పదంగా మారింది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. జగదాంబ జంక్షన్ నుంచి టర్నర్‌చౌల్ట్రీ మెయిన్‌రోడ్డు షాపింగ్ మాల్స్, వస్త్రవ్యాపారాలతో నిత్యం రద్దీగా ఉంటోంది. నగరంలోని పలు ప్రాంతాల నుంచి షాపింగ్ మాల్స్‌లో వస్త్రాల కొనుగోలుకు వచ్చేవారితో ఉదయం నుంచి రాత్రి వరకు జగదాంబ, లేపాక్షి జంక్షన్లు రద్దీగా ఉంటాయి. లేపాక్షి కూడలి నుంచి టర్నర్ చౌల్ట్రీ వరకు ఇటీవల రోడ్డు మధ్యలో డివైడర్లను ఏర్పాటు చేశారు. వన్‌వే కావడంతో వాహనదారులు ఒక పక్క వెళ్లడం, మరో పక్క మెయిన్ రోడ్డు నుంచి జగదాంబ జంక్షన్‌కు చేరుకోవడం నిత్యకృత్యంగా ఉండేది. దీంతో పోలీసులు జగదాంబ క్లాక్ టవర్ వద్ద ఆటోలను లేపాక్షి కూడలి మీదుగా అనుమతించకుండా మసీదు రోడ్డు వైపు మళ్లించారు. శుక్రవారం రాత్రి ఇంజనీరింగ్ అధికారులు దసపల్లా వైపు మార్గం వద్ద డివైడర్లు తొలగించారు. ట్రాఫిక్ ఏడీసీపీ, మహారాణిపేట ట్రాఫిక్ పోలీసులకు తెలియకుండా డివైడర్లు తొలగించి మార్గం సుగమం చేయడం పట్ల ట్రాఫిక్ పోలీసు వర్గాలు గుర్రుగా ఉన్నాయి. ఇంజనీరింగ్ అధికారులకు ఈ ప్రాంతంలో వచ్చిన ఇబ్బందులేమిటి? పోలీసులతో సమన్వయం చేసుకుని నిర్ణయం తీసుకోకుండా, ఏకపక్షంగా ఎందుకు వ్యవహరించారో ఎవరికీ అర్థం కావడం లేదు. జగదాంబ జంక్షన్ నుంచి టర్నర్ చౌల్ట్రీ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు, ద్విచక్ర వాహనాలు, కార్లు, పాదచారులకు దసపల్లా వైపు మళ్లించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నది స్థానికుల ఆరోపణ. జీవీఎంసీ అనాలోచిత చర్యతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని పోలీసు వర్గాలు అంటున్నాయి.

కనక మహాలక్ష్మికి తులసీ దళార్చన



జగదాంబ కూడలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో కనకమహాలక్ష్మి అమ్మవారికి తులసీ దళార్చన సేవలను శనివారం ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. నిత్య పూజలతో పాటు ప్రత్యేక పూజల్లో భాగంగా తులసి మాలలతో అమ్మవారిని దివ్యంగా అలంకరించారు. అనంతరం భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు పర్యవేక్షించారు. ఇటీవల మార్గశిర మాసోత్సవాలు పెద్దఎత్తున నిర్వహించిన సమయంలోనూ అమ్మవారికి తులసీ దళార్చన ఎప్పటికప్పుడు నిర్వహించేవారు.

తిరు వెంకట ముడియాన్ అలంకరణలో అప్పన్న

సింహాచలం, జనవరి 11 (ఆంధ్ర జ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జరుగుతున్న అధ్యయనోత్సవాల్లో అంతర్భాగమైన రాపత్తు ఉత్సవాల్లో భాగంగా శనివారం తిరువెంకట ముడియాన్ (వెంకటేశ్వరస్వామి) అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. రెండు చేతుల్లో పాంచజన్యం, సుదర్శనం, కటిహస్తం, అభయ హస్తంతో ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఆలయ అలంకారి కరి సీతారామాచార్యులు భక్తులకు కనువిందుగా అలంకరించారు. స్వామివారిని ఉభయ దేవేరులతో పల్లకిలో అధిష్టింపజేసి ప్రధాన మాడవీధుల్లో తిరువీధి జరిపారు. మార్గం పొడవునా భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలిచ్చి ఆహ్వానం పలికారు.

ఉక్కులో వీఆర్ఎస్!

... 5వ పేజీ తరువాయి

సర్దుబాటు, ఉత్పత్తి వ్యయం తగ్గింపు, ఉత్పాదకత పెంపు కోసమే ఈ చర్యలు చేపడుతున్నామని వివరించింది. ప్రస్తుతం స్టీల్‌ప్లాంటులో 12,400 మంది ఉద్యోగులు ఉన్నారు. దీనిని పది వేల లోపు తేవాలనే లక్ష్యంతో యాజమాన్యం చర్యలు చేపడుతోంది. ఈ ఏడాది అంటే 2025లో డిసెంబరు నెలాఖరుకు 1,218 మంది పదవీ విరమణ చేస్తారు. ఇప్పుడు వీఆర్ఎస్‌తో వేయి మంది తగ్గిపోతారు. స్పందన అధికంగా ఉంటే...మరోసారి ప్రకటన ఇచ్చి మరికొంత మందిని తగ్గించే అవకాశం ఉంది.

వెళ్లిపోవాలనే ఆలోచనలో అత్యధికులు

విశాఖ స్టీల్‌ప్లాంటు చాలా ఇబ్బందుల్లో ఉంది. ప్లాంటును పూర్తిస్థాయిలో నడపడానికి అవసరమైన నిధులు లేవు. ముడి పదార్థాల కొరత ఉంది. కేంద్రం సాయం చేస్తామని మాటలు మాత్రమే చెబుతోంది. కనీసం జీతాలు కూడా ఇవ్వడం లేదు. ఉద్యోగులకు నాలుగు నెలలుగా జీతాలు లేవు. మొన్న దసరా, దీపావళి పండుగలకు జీతాలు ఇవ్వలేదు. ఇప్పుడు సంక్రాంతికి కూడా ఇవ్వలేదు. ఎప్పుడో ఇస్తారో కూడా చెప్పడం లేదు. అంటే యాజమాన్యానికి జీతాలు సక్రమంగా ఆలోచన లేదని ఉద్యోగులకు అర్థమైంది. మరోవైపు కాంట్రాక్టు కార్మికులను భారీగా తగ్గించడంతో అనేక విభాగాల్లో నిర్వహణ పనులు ఆగిపోయాయి. దాంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉత్పత్తికి ఆటంకం కలుగుతోంది. తక్కువ వనరులతో పూర్తి ఉత్పత్తి తీయాలని ఒత్తిడి పెడుతున్నారు. అలా చేసినా జీతాలు ఇవ్వడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఇక్కడ పనిచేయడం కంటే ఎంత ఇస్తే అంత తీసుకొని బయటకు వెళ్లిపోవడమే మంచిదని అత్యధికులు భావిస్తున్నారు. ఇప్పటికే చాలామంది కుటుంబాలను పోషించుకోవడానికి రోజుకు మూడు నుంచి నాలుగు గంటలు డెలివరీ బాయ్స్‌గా పనిచేస్తున్నారు.

వీఆర్ఎస్ ప్రకటన విరమించుకోవాలి

... 5వ పేజీ తరువాయి

క్రూరమైన చర్య అన్నారు. స్టీల్‌ప్లాంటులో ఐదు వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని 2023లో పార్లమెంటులో కేంద్ర మంత్రి ప్రకటన చేశారని, తరువాత కాలంలో మరో రెండు వేల మంది పదవీ విరమణ చేశారని...మొత్తం ఏడు వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్న సమయంలో వీఆర్ఎస్ ప్రకటన చేయడం దుర్మార్గమన్నారు. వీఆర్ఎస్ తీసుకోవద్దని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. యాజమాన్యం ఇచ్చిన ఉత్తర్వులు ఉపసంహరించుకోకపోతే తీవ్రస్థాయిలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, పీవీ రమణమూర్తి, బీఎస్ రాజు, వరసాల శ్రీనివాసరావు, వి.ప్రసాద్, సురేష్‌బాబు, కామేశ్వరరావు పాల్గొన్నారు.

కిక్కిరిసిన రైళ్లు

... 5వ పేజీ తరువాయి

ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లు కూడా అలాగే వెళ్లాయి.

కిక్కిరిసిన పాసింజర్ రైళ్లు

విశాఖ నుంచి ఉత్తరాంధ్రలోని కొత్తవలస, విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, చీపురుపల్లి, పొందూరు, శ్రీకాకుళం రోడ్డు, తిలారు, కోటబొమ్మాళి, నౌపడా, పలాస, మందస, సోంపేట, ఇచ్ఛాపురం వంటి ప్రాంతాలకు వెళ్లేవారిలో అత్యధికులు రైళ్లను ఆశ్రయించాయి. దీంతో విశాఖ-భువనేశ్వర్ ఇంటర్‌సిటీ (22820), గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (17243) రైళ్లతోపాటు విశాఖ-భవానీపట్న (58504), విశాఖ-బ్రహ్మపూర్ (58532), విశాఖ-పార్వతీపురం పాసింజర్ (67287), విశాఖ-కోరాపుట్ (58538), విశాఖ-గునుపూర్ (58506), విశాఖ-రాయపూర్ (58528) పాసింజర్ రైళ్లు రద్దీగా నడిచాయి.

నేడు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు ప్రభావం

విజయవాడ డివిజన్‌లో జరుగుతున్న నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో విశాఖ నుంచి గుంటూరు వెళ్లే సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240)ను ఆదివారం రద్దు చేయడంతో ఆ ప్రభావం జన్మభూమి (12805), రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12717)లపై పడే అవకాశం ఉంది. అయితే ఆదివారం ఉదయం 8.00 గంటలకు విశాఖ నుంచి చర్లపల్లికి ప్రత్యేక జనసాధారణ్ రైలు ప్రవేశపెట్టిన నేపథ్యంలో ప్రయాణికులకు కొంత ఊరట కలిగించే అవకాశాలు ఉన్నాయి.

చుక్కల్లో విమాన టికెట్ల ధరలు

... 5వ పేజీ తరువాయి

ఎంచుకుంటున్నారు. మామూలు రోజుల్లో హైదరాబాద్ నుంచి విశాఖకు టిక్కెట్ ధర రూ.4 వేలలోపే ఉంటుంది. ఇప్పుడు రూ.15 వేల నుంచి రూ.17 వేలు చూపిస్తోంది. చెన్నై నుంచి విశాఖకు సాధారణ రోజుల్లో టిక్కెట్ ధర రూ.5 వేలలోపు ఉండగా ఇప్పుడు రూ.17 వేలు దాటి చూపిస్తోంది.

విజయవాడ విమానాలకు డిమాండ్

రాష్ట్ర రాజధాని విజయవాడ నుంచి విశాఖపట్నానికి మామూలు రోజుల్లో విమాన టిక్కెట్ ధర రూ.3 వేలు ఉండగా ఇప్పుడు అది రూ.7వేలకుపైనే చూపిస్తోంది.

ఏయూకు రీసెర్చ్ ప్రాజెక్టు

... 5వ పేజీ తరువాయి

కాలేజీ పరిధిలోని వివిధ విభాగాలకు చెందిన పరిశోధకులకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడనుంది. గతంలో ఈ నిధులను డిపార్టుమెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నేరుగా యూనివర్సిటీలకు అందించేది. ఈ ఏడాది హబ్స్‌గా ఏర్పాటుచేసి వాటికి కేటాయిస్తోంది. పరిశోధనకు సంబంధించి యూనివర్సిటీల మధ్య ఆరోగ్యకరమైన పోటీని పెంచేందుకు ఈ విధానం దోహదపడుతుందని సీనియర్ ప్రొఫెసర్లు చెబుతున్నారు.

బస్ కాంప్లెక్స్‌లలోనూ...

... 5వ పేజీ తరువాయి

కాకినాడ 30, భీమవరం 4, అమలాపురం 4 ప్రత్యేక సర్వీసులు నడిపారు. అలాగే జోన్ పరిధిలోని శ్రీకాకుళం 100, విజయనగరం 50, పార్వతీపురం 50, పాలకొండ 30, పలాస 50, టెక్కలి 20, సోంపేట 20, ఇచ్ఛాపురం 10 ప్రత్యేక సర్వీసులు ఆపరేట్ చేశారు. ప్రయాణికుల డిమాండ్ ఉంటే రాత్రికి కూడా ప్రత్యేక బస్సులు నడుపుతామని రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు ప్రకటించారు. ఆదివారం కూడా ఇదేవిధంగా డిమాండ్ ఉండే అవకాశం ఉందని, అందుకు తగ్గట్టుగా బస్సులు సమకూర్చుకుంటున్నామని ఆయన తెలిపారు.

జోరుగా బెట్టింగ్

... 5వ పేజీ తరువాయి

తాము ఏమీ చేయలేమని సదరు ప్రజా ప్రతినిధికి టాస్క్‌ఫోర్స్ పోలీసులు సున్నితంగా చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. తర్వాత మరొక ప్రజా ప్రతినిధి పీఏ ద్వారా ఒత్తిడి చేసినప్పటికీ పోలీసులు కేసు నమోదుచేయడంతో పాటు రవికుమార్‌ను అరెస్టు చేసినట్టు రికార్డుల్లో చూపించేశారు. మిగిలిన నలుగురు పరారీలో ఉన్నందున అరెస్టు చేయలేకపోయామంటూ పోలీసులు చెబుతున్నారు. కానీ ప్రజా ప్రతినిధుల నుంచి ఒత్తిళ్ల కారణంగానే పోలీసులు వారి జోలికి వెళ్లడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ తరహా బుకీలు నగరంలో చాలామంది ఉన్నారని చెబుతున్నారు. బెట్టింగ్‌లపై స్థానిక పోలీస్ స్టేషన్‌లోని కొందరు సిబ్బందికి సమాచారం ఉంటుందని, అయితే బుకీలు ముందుగానే వారిని ప్రసన్నం చేసుకోవడంతో వారి జోలికి వెళ్లడం లేదని అంటున్నారు. పెదవాల్తేరులో పట్టుబడిన రవికుమార్ విషయానికి వస్తే, స్థానికంగా ఉన్న కొందరు పక్కా ఆధారాలతో నేరుగా సీపీకి ఫిర్యాదు చేయడం వల్లే అతను పట్టుబడ్డాడని, అదే స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తే, వారు ముందుగానే ఫోన్ చేసి అప్రమత్తం చేసేవారని కొందరు అభిప్రాయపడుతున్నారు. పోలీస్ కమిషనర్ ఇప్పటికైనా బెట్టింగ్‌పై పూర్తిస్థాయిలో దృష్టిసారించి బుకీలకు ముకుతాడు వేయాలని కోరుతున్నారు.

వెంకటగిరి ప్రదక్షిణ రేపు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పౌర్ణమిని పురస్కరించుకుని వెంకటగిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకులు తెలిపారు. సోమవారం ఉదయం ఏడు గంటలకు గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందన్నారు.

టీడీపీ నాయకులకు సత్కారం

పెదగంట్యాడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 75వ వార్డు పరిధిలో అత్యధికంగా టీడీపీ సభ్యత్వ నమోదు చేసిన బూత్ ఇన్‌చార్జిలను కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి శనివారం ఇక్కడ పార్టీ కార్యాలయంలో సత్కరించారు. పార్టీ మండల సమన్వయకర్త ములకలపల్లి పెంటయ్య, బూత్ కమిటీ సభ్యులు ఉరుకూటి అప్పలరాజు, ఎన్.పుష్పలత ఒక్కొక్కరు ఐదు వందలకు పైబడి క్రియాశీల సభ్యత్వాలు నమోదు చేయడంతో సన్మానించారు. నాయకులు పులి వెంకటరమణారెడ్డి, నమ్మి అప్పారావు, డి.పెరుమాళ్లు, ఎం.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు యూత్ మారథాన్

మల్కాపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం గాజువాక ఆర్టీసీ డిపో నుంచి మల్కాపురం మెయిన్ రోడ్డు వరకు ఉదయం ఆరు గంటలకు యూత్ మారథాన్ నిర్వహిస్తున్నట్టు పార్టీ నగర ప్రధాన కార్యదర్శి పోలిమేర శ్రీను తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ పి.గణబాబు ప్రారంభిస్తారన్నారు. మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు, రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర మోహన్, గాజువాక ఏసీపీ త్రినాథ్ తదితరులు పాల్గొంటారన్నారు.

కార్మికులకు దుస్తులు పంపిణీ

అగనంపూడి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధిలో గల పారిశుధ్య కార్మికులకు శనివారం ప్రభుత్వం సమకూర్చిన దుస్తులను కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, కూటమి నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ కోసం నిరంతం పనులు చేస్తున్న కార్మికులకు ప్రభుత్వం వస్త్రాలు సమకూర్చడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు ఇన్‌చార్జి జి.అప్పారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీతారామయ్య పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో భద్రతా నియమాలపై అవగాహన

అగనంపూడి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో ఏరియా ఆస్పత్రిలో రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి, డాక్టర్ ఉష, తదితరులు పాల్గొని రహదారి భద్రత గురించి వివరించారు. వాహనాలు నడిపే వారందరూ రహదారి భద్రతను దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని కోరారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడిపితే ప్రమాదాలు సంభవించి ప్రాణాలు కోల్పోతారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రజ్వీ సుల్తానా, ఐసీటీసీ కౌన్సిలర్ రవి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **డాకు మహారాజ్:** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, శారద, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ, శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 14, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 56, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 46, బీరకాయలు 58, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 16, క్యాబేజీ 18, క్యారెట్ 40, దొండకాయలు 50, బంగాళదుంపలు 26, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 46, మునక్కాడలు (కిలో) 100, బరబాటి 52, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 340, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 80, కీరదోస 36, క్యాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 44, కంద 70, దేముడుచిక్కుడు 68, గోరుచిక్కుడు 34, ఆగాకార దేశవాలి 100, ఆగాకర హైబ్రిడ్ 100, కూర పెండలం 44, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 52, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 34, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	102
లైవ్ ధర	122
విత్ స్కిన్	214
స్కిన్‌లెస్	224



సంక్రాంతికి ఊరెళుతున్నారా.. తస్మాత్ జాగ్రత్త!



పండగ సమయంలో దొంగతనాలకు అవకాశం ఇవ్వకుండా అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

స్వస్థలాలకు వెళ్లేవారంతా ఇళ్లలో విలువైన బంగారు ఆభరణాలు, నగదు ఉంచవద్దు

క్యాంప్ వెళుతున్నట్టు సమాచారం అందిస్తే ఆయా ఇళ్లపై ప్రత్యేక నిఘా పెడతామని వెల్లడి

కూర్మన్నపాలెం/ఉక్కు టౌన్‌షిప్/గోపాలపట్నం/పెందుర్తి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మహా నగరంలో సంక్రాంతి సందడి మొదలైంది. పాఠశాలలు, కాలేజీలకు ఈ నెల పదో తేదీ నుంచి సెలవులు ప్రకటించడంతో సొంతూళ్లకు వెళ్లేవారితో అప్పుడే రైళ్లు, బస్సులు రద్దీగా కనిపిస్తున్నాయి. చాలామందికి రైళ్లలో రిజర్వేషన్లు దొరక్కపోవడంతో అందుబాటులో ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులను ఆశ్రయిస్తూ స్వస్థలాలకు బయలుదేరుతున్నారు. ఇదే అదనుగా జేబులు, ఇళ్లను గుల్లచేసే దొంగల ముఠాలు చోరీలకు పాల్పడే పనిలో నిమగ్నమవ్వడం సర్వసాధారణంగా మారింది. పోలీసులు ఎంత నిఘా పెట్టినా, అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా ప్రజలు ఏ మాత్రం అప్రమత్తంగా లేకున్నా దొంగలకు అడ్డుకట్ట వేయడం సాధ్యం కాదు. ఈ క్రమంలో గత కొద్ది రోజులుగా పలు ప్రాంతాల్లో సంక్రాంతికి ఊరెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు అవగాహన కార్యక్రమాలు, ఆటోల ద్వారా ప్రచారాలు చేపడుతున్నారు. అంతేకాక పెద్ద పండగ నేపథ్యంలో ఇతర ప్రాంతాలకు వెళ్లే వారంతా ముందుగా సమీపంలోని తమ స్టేషన్లకు సమాచారం అందిస్తే ఆయా ఇళ్లపై ప్రత్యేక నిఘా పెడతామని పోలీసులు సూచిస్తున్నారు. ఎక్కడైనా ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్టు కనిపిస్తే తక్షణమే తమకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

సీసీ కెమెరాల నిఘా..

దొంగతనాలకు అడ్డుకట్ట వేసేందుకు ఆధునిక పద్ధతులను వినియోగించి పోలీసులు పహారా కాస్తున్నారు. ఇందులో భాగంగా ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అపార్ట్‌మెంట్ల వద్ద, షాపింగ్ కాంప్లెక్స్‌లు, పెద్ద పెద్ద వ్యాపార కేంద్రాలు, బ్యాంకులు, ఏటీఎం సెంటర్ల వద్ద, ప్రముఖ కూడళ్లలో సీసీ కెమెరాలను తప్పనిసరి చేస్తూ పోలీసులు చర్యలు చేపడుతున్నారు.

అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా..

దొంగతనాల నియంత్రణకు ప్రజలను చైతన్యపరుస్తూ పోలీసులు పలు కాలనీలు, అపార్ట్‌మెంట్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా పలువురు తగిన జాగ్రత్తలను పాటించడం లేదు. దీంతో చోరీలు జరుగుతున్నాయి. అందువల్ల పండగ రోజుల్లో అన్ని ప్రాంతాల్లో పోలీసుల గస్తీని మరింత పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

సమాచారమిస్తే గస్తీ ఏర్పాటు చేస్తాం



పండక్కి ఊరెళుతున్నట్టు ప్రజలు తమకు సమాచారం అందిస్తే ఆ ప్రాంతంలో గస్తీ ఏర్పాటు చేస్తాం. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే మాకు సమాచారం అందించాలి. దొంగతనాలపై ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. పండగ వేళ ఇతర ప్రాంతాలకు వెళ్లేవారంతా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంట్లో విలువైన బంగారు ఆభరణాలు, పెద్ద మొత్తంలో నగదు ఉంచడం శ్రేయస్కరం కాదు.

-కె.మల్లేశ్వరరావు, దువ్వాడ సీఐ

విలువైన వస్తువులను ఇంట్లో ఉంచొద్దు



పెద్ద పండక్కి తమ సొంతూళ్లకు ఊరెళ్లే వారంతా ముందుకు తమకు సమాచారం అందిస్తే సదరు ఇళ్లపై ప్రత్యేక నిఘా పెడతాం. ఇంట్లో విలువైన ఆభరణాలను ఉంచకూడదు. ఇల్లు ఖాళీగా ఉంచకుండా తెలిసిన కుటుంబ సభ్యులను ఎవరినైనా ఉంచితే ఎంతో మంచిది. దొంగతనాల నివారణకు పోలీస్ సిబ్బంది నిరంతరం గస్తీ తిరుగుతారు. ప్రజలకు సేవ చేసేందుకు తమ సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉంటారు.

-ఈ.కేశవరావు, స్టీల్‌ప్లాంట్ సీఐ



ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌తో మేలు

ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లు వెళ్లే వాళ్లంతా అనుక్షణం తమ గృహాలు పోలీసుల నిఘాలో ఉండేలా ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్) యాప్ దోహదపడుతుంది. ఈ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్నాక వినియోగదారులు తమ పేరు, చిరునామా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అనంతరం ప్రతి వినియోగదారుడికి ఒక యూజర్ ఐడీ కేటాయించడం జరుగుతుంది. ఇంటికి తాళం వేసి ఊరెళ్లే సమయంలో యూజర్ ఐడీని వినియోగించి యాప్ ద్వారా ఊరు వెళ్లే సమయం, తిరిగి వచ్చే తేదీని మెసేజ్ రూపంలో పెడితే స్థానిక పోలీసులు ఆ ఇంటి వద్ద సీసీ కెమెరా, అలారాన్ని అమరుస్తారు. తద్వారా పోలీస్ నిఘాతో కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం అవుతుంది. అప్పుడు సంబంధిత ఇంట్లో చిన్న శబ్దం వచ్చినా కంట్రోల్ రూమ్‌లో అలారం మోగుతుంది. తక్షణమే పోలీసులు అప్రమత్తమై తగిన చర్యలు తీసుకుంటారు. ఇందుకోసం ఎలాంటి రుసుం తీసుకోకుండా పోలీసులు చోరీల నియంత్రణకు కృషి చేస్తున్నారు. ఈ యాప్ గురించి ప్రచారం కూడా చేస్తున్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను వాడాలి



సంక్రాంతి పండగకు ఇళ్లకు తాళాలు వేసి సొంతూళ్లకు వెళ్లే వారంతా లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్ ఎంఎస్) యాప్‌ను వినియోగించుకోవాలి. ఊరెళుతున్నవారు తమకు సమాచారం అందిస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ద్వారా సంబంధిత ఇంటిపై నిఘా పెడతాం. ఊరెళ్లేటప్పుడు విలువైన బంగారం, నగదును ఇళ్లల్లో ఉంచకుండా లాకర్లలో భద్రపరుచుకోవడం శ్రేయస్కరం. పండగ, పరసల సీజన్లలో నగలు ధరించే మహిళలంతా చైన్ స్నాచింగ్‌లకు అవకాశం లేకుండా చీర, చున్నీలను కప్పుకోవాలి. తమ పరిసర ప్రాంతాల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం అందించాలి.

-కేవీ సతీశ్‌కుమార్, పెందుర్తి సీఐ

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి



ప్రజలంతా అప్రమత్తంగా ఉంటే చోరీల నియంత్రణ సాధ్యమవుతుంది. పండగ సమయంలో చోరులు హల్‌చల్ చేసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. తాళం వేసి ఉన్న ఇళ్లనే ఎక్కువగా టార్గెట్ చేస్తుంటారు. అలాగే రద్దీగా ఉండే రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ఏటీఎం కేంద్రాల వద్ద అదును చూసి చోరీలకు పాల్పడుతుంటారు. ఇళ్లకు తాళం వేసి ఊరెళ్లే వారంతా పోలీసుల సేవలను వినియోగించుకోవాలి. ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా మెరుగైన సేవలందిస్తున్నాం.

-జి.తేజేశ్వరరావు, గోపాలపట్నం క్రైమ్ ఎస్ఐ

జీతాలివ్వకుండా ఉద్యోగులను వేధిస్తున్న ఉక్కు యాజమాన్యం

» సీఐటీయూ ప్లాంట్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్



స్టీల్ కంచాలపై గరిటెలతో శబ్దాలు చేస్తూ నిరసన తెలుపుతున్న కార్మికులు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు జీతాలు చెల్లించకుండా యాజమాన్యం అన్ని విధాల వేధిస్తుందని సీఐటీయూ ప్లాంట్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం ప్లాంట్ పరిపాలన భవనం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలల వేతనం బకాయి ఉండడంతో ఉద్యోగులు, కార్మికులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వేతనాలు, పీఎఫ్ బకాయిలు రూ.500 కోట్లు, త్రిఫ్ట్ సొసైటీకి రూ.80 కోట్లు, పించన్‌దారులకు రూ.100 కోట్లు చెల్లించకుండా కార్మిక వర్గాన్ని వేధింపులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు స్టీల్ కంచాలపై గరిటెలతో శబ్దాలు చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామస్వామి, వైటీ దాసు, గంగాధర్, రాజు, వెంకటేశ్వరరావు, నీలకంఠం, తదితరులు పాల్గొన్నారు.

నిరాశపరిచిన మోదీ పర్యటన

విశాఖ పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ స్టీల్‌ప్లాంట్ విషయంలో హామీలిస్తారని అందరూ ఎంతో ఆశతో ఎదురుచూశామని, కానీ ఫలితం శూన్యమని ఇంటక్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. ప్లాంట్ యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి పెట్టుబడులు రావడం మంచి విషయమే అయినప్పటికీ ఉన్న సంస్థలను నిర్వీర్యం చేయడం భావ్యం కాదన్నారు. కూటమి స్టీల్‌ప్లాంట్ విషయంలో ప్రభుత్వం వెనకడుగు వేస్తే రాష్ట్రంలో తీవ్ర పరిస్థితులకు దారితీస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మంత్రి రాజశేఖర్, కారు రమణ, ప్రభాకరరెడ్డి, అవతారం, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయాల్లో వైభవంగా కూడారై ఉత్సవం



గోదాదేవికి నివేదించిన ప్రసాదం

పెందుర్తి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం నగరంలోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో కూడారై ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఇక్కడి వెంకటాద్రిపై గల శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గర్భాలయంలోని శ్రీవారి మూలవిరాట్ ముంగిట గోవిందుని తిరునామాల ఆకృతితో 108 వెండి గంగాళాలతో కూడారై ప్రత్యేక ప్రసాద నివేదన చేశారు. అనంతరం ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. 27వ పాశురాన్ని అర్చకులు పఠించారు. వేంకటేశ్వరుడికి నక్షత్ర హారతులిచ్చి, గోదాదేవికి కుంకుమార్చనలు చేశారు.

శ్రీనగర్: గ్రేటర్ 88వ వార్డు పరిధి గ్రీన్‌సిటీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో, 71వ వార్డు శ్రీనగర్ శ్రీకృష్ణ గోవర్ధన ఆలయంలో అర్చకులు 108 పాత్రలతో పాయసాన్ని శ్రీవారికి నివేదించి కూడారై ఉత్సవాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ కార్యదర్శి కరేటి సహదేవరావు పర్యవేక్షణలో శ్రీకృష్ణుడికి పంచామృతాలతో, చందనం, విభూదులతో అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ బండి సురేశ్‌కుమార్, వీవీ కృష్ణారావు, పద్మావతి, రాజ్యలక్ష్మి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు పరిధి శాంతినగర్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారిని గరుడ వాహనంపై ఆశీనులను చేసి తిరువీధి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తుల కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారిని ఆలయం నుంచి సాయినగర్, ప్రశాంతినగర్, శనివాడ వేపచెట్టు జంక్షన్ మీదుగా ఊరేగించారు. అర్చకులు 27వ పాశురాన్ని చదివి వినిపించారు. 108 వెండి పాత్రల్లో ప్రసాదాలను శ్రీవారికి నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఈకే చారి, కమిటీ ప్రతినిధులు ఎం.ఉమామహేశ్వరరావు, కృష్ణారావు, సాయిబ్‌నాయుడు, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: ప్రకాశనగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పద్మావతి, అలివేలు మంగమ్మ సమేత శ్రీవారికి అర్చకులు చక్రస్నానం జరిపారు. ఆలయం ఎదురుగా తాత్కాలిక కోనేరును ఏర్పాటు చేసి తులసి ఆకులు, పుష్పాలు వేశారు. అనంతరం ఉత్సవమూర్తులను కోనేరు వద్దకు తెచ్చి చక్రస్నానం చేయించారు. ఆ తర్వాత ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం చేశారు. మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ పూజల్లో పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై గల వేంకటేశ్వర వినాయక స్వామి దేవస్థానంతో పాటు షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో కూడారై ఉత్సవాన్ని నిర్వహించారు. బాలాజీ దివ్యక్షేత్రంలో స్వామివారి ముందు రంగులతో గోదాదేవి చిత్రాన్ని వేసి, దానిపై 108 పాత్రలతో ప్రసాదాన్ని శ్రీవారికి సమర్పించారు. బీహెచ్‌పీవీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి ముందు గోవింద నామాలను చిత్రించి.. వాటిపై 108 కలశాల్లో కూడారై ప్రసాదం వేసి స్వామివారికి నివేదించారు.



బాలాజీ దివ్యక్షేత్రంలో గోదాదేవికి నివేదించిన ప్రసాదం

పెదగంట్యాడ: ఇక్కడి గరుడాద్రిపై గల శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన చేపట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల, సభ్యులు దాడి నాగ అప్పారావు, సూర్యకాంతం, తదితరులు పాల్గొన్నారు.

సందడిగా సంక్రాంతి సంబరాలు

గోపాలపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నరవలోని బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో సంక్రాంతి సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ బెహరా విజయచైతన్య మాట్లాడుతూ సనాతన ఆచార సంప్రదాయాలను ప్రతిఒక్కరూ గౌరవించాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, వేసిన ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళాశాల ఆవరణలో భోగి మంట వేసి సంక్రాంతి సంబరాలు ప్రారంభించారు. ఏడీ బి.తరుణ్‌కుమార్, ప్రిన్సిపాళు డాక్టర్ శ్రీధర్ పట్నాయక్, డాక్టర్ హిందుమతి, వరలక్ష్మి, వి.సుకన్య, అనిల్, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని స్వామి వివేకానంద పాఠశాల, జ్ఞాన్ వికాస్ పాఠశాల, సరస్వతి స్కూల్‌తో గాజువాక ఆర్టీసీ డిపో సమపంలోని ఎంవీఆర్ డిగ్రీ కాలేజీలో, సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాలలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. శ్రీహరిపురం జీవీఎంసీ వాకర్స్ మైదానంలో ఇండస్ట్రియల్ జోన్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఏ-గ్రూప్ ఆధ్వర్యంలో షటిల్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

అగనంపూడి: విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు సందడిగా సాగాయి. భోగి మంటలు, బొమ్మల కొలువులు, రంగవల్లులు, విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు అబ్బురపరిచాయి. ప్రిన్సిపాల్ అరుంధతి, ఎన్ఎస్ఎస్ కో- ఆర్డినేటర్ సుహాసిని, రమేశ్, డీన్లు, అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్: సంప్రదాయానికి ప్రతీక సంక్రాంతి అని శ్రీనగర్‌లోని యాపిల్ స్కూల్ చైర్మన్ తలశిల బలరామ కృష్ణ అన్నారు. స్కూల్‌లో నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో రంగవల్లులు, గొబ్బెమ్మలు, భోగి మంటలు, గంగిరెద్దులు, హరిదాసుల వేషధారణతో చిన్నారులు ఆకట్టుకున్నారు. పలు పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్, ప్రమీలా ముఖర్జీ, సుభాషిణి, విజయ, తదితరులు పాల్గొన్నారు.



భోగి మంట వేస్తున్న 'బెహరా' డైరెక్టర్ విజయచైతన్య

ఉక్కుటౌన్‌షిప్: విద్యార్థులందరూ మన సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన కలిగి ఉండాలని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఎస్‌సీ పాండే అన్నారు. ప్లాంట్ డీపీఎస్‌లో జరిగిన సంక్రాంతి సంబరాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంక్రాంతి పండగ అందరి జీవితంలో వెలుగులు నింపాలన్నారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీర్‌కుమార్ పాండే, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

కూర్మన్నపాలెం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితి క్రీడా మైదానంలో శనివారం కార్పొరేటర్ బొండా జగన్ సంక్రాంతి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంటును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో యువతకు ఆరోగ్యంతో పాటు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందన్నారు. స్నేహ బాంధవ్యాలు ఏర్పడడానికి ఇలాంటి పోటీలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రగడ వేణుబాబు, ఎస్ఎస్ విజయరామరాజు, పి.శ్రీనివాస్, సన్యాసిరావు, .శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

నగరానికి గవర్నర్ రాక

గోపాలపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ శనివారం రాత్రి నగరానికి చేరుకున్నారు. ఆయనకు ఎయిర్‌పోర్టులో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, సీపీ డాక్టర్ శంఖబ్రతబాగ్చి, ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ బీహెచ్ భవానీశంకర్, విశాఖ ఆర్డీవో శ్రీలేఖ, ఇతర అధికారులు స్వాగతం పలికారు. గవర్నర్ ఈనెల 13వ తేదీ ఉదయం తిరిగి విజయవాడ వెళతారు.

బ్యాటరీ కార్ల నిర్వాహకులకు షోకాజ్ నోటీసులు

వీఎంఆర్డీయే చైర్మన్ ప్రణవ్‌గోపాల్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కైలాసగిరిపై బ్యాటరీ కార్ల నిర్వాహకులతో మాట్లాడుతున్న ప్రణవ్‌గోపాల్

విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కైలాసగిరిలో వీఎంఆర్డీయే చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కొండపై బ్యాటరీ కార్ల దోపిడీ అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శనివారం వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సందర్శకుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన బ్యాటరీ కార్ల నిర్వాహకులు వీఎంఆర్డీయే నిర్థేశించిన ధరల కంటే అధికంగా వసూలు చేస్తున్నందుకు షోకాజ్ నోటీసులు అందజేసినట్టు తెలిపారు. పర్యాటక ప్రాంతంలోని వ్యాపారులు నిర్థేశించిన ధరల కంటే అధికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆయన పర్యాటకులతో ముచ్చటించారు. పారిశుధ్యం మెరుగుపరచాలని, తాగునీటి సదుపాయం కల్పించాలని సూచించారు. ఆయనతో పాటు జాయింట్ కమిషనరు కె. రమేశ్ ఉన్నారు.

ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్ విజేతకు ప్రశంసలు




ఇంటర్నేషనల్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డుల విజేతకు అభినందిస్తున్న తలశిల బలరామ కృష్ణ, విష్ణువర్ధన్

శ్రీనగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): టీఎస్సార్ టీబీకే కళాశాల పీజీ విద్యార్థి ఎం.గణేశ్ గత అక్టోబరు 25న హైదరాబాద్‌లో నిర్వహించిన వరల్డ్ రికార్డ్స్ ఎక్సలెన్స్ పోటీల్లో సో సైక్లింగ్ విభాగంలో ఎటువంటి ఆధారం లేకుండా 3 నిమిషాల 22 సెకెండ్ల పాటు సైకిల్‌ను నిలిపి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డుల్లో పేరు నమోదు చేసుకుని స్వర్ణ పతకం సాధించాడు. ఈ సందర్భంగా గణేశ్‌ను శనివారం కళాశాల చైర్మన్ తలశిల బలరామకృష్ణ, ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధనరావు అభినందించారు.

'స్టీల్ క్లబ్‌ను మరింత అభివృద్ధి చేస్తాం'

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉక్కు యాజమాన్యం, క్లబ్ సభ్యుల సహకారంతో స్టీల్ క్లబ్‌ను మరింత ప్రగతిపథంలోకి తీసుకువెళతామని క్లబ్ నూతన కార్యదర్శి పెంటకోట రామకృష్ణ అన్నారు. శనివారం క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్లబ్ పాలకవర్గం ఎన్నికల్లో తనను గెలిపించడం ఎంతో ఆనందంగా ఉందంటూ అందుకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. క్లబ్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.

ఇంటక్ స్టీల్‌ప్లాంట్ అధ్యక్షుడిగా రమణమూర్తి



ఉక్కుటౌన్‌షిప్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇంటక్ స్టీల్‌ప్లాంట్ అధ్యక్షుడిగా పీవీ రమణమూర్తి నియమితులయ్యారు. శనివారం ఇంటక్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ ప్లాంట్‌కు సంబంధించిన నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. చీఫ్ ప్యాట్రన్‌గా నీరుకొండ రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా బీఎస్ రాజు, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మద్ది అప్పలరాజు, అదనపు ప్రధాన కార్యదర్శిగా కొవిరి అవతారంతో పాటు పలువురు సభ్యులుగా నియమితులయ్యారు. కార్మికుల సంక్షేమం, ప్లాంట్ ప్రగతి కోసం కృషి చేస్తానని రమణమూర్తి పేర్కొన్నారు.

చంద్రబాబుతోనే స్వర్ణాంధ్ర సాధ్యం: 'నల్లూరు'

కూర్మన్నపాలెం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే స్వర్ణాంధ్ర సాధ్యమని టీడీపీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ అన్నారు. 86వ వార్డు పరిధి మాతృశ్రీ నగర్, ఉప్పర కాలనీలలో శనివారం నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి ఆయనతో పాటు నాయకులు వెళ్లి సభ్యత్వ నమోదు చేయించారు. కాలనీల్లో సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు వేగుంట శ్రీనివాస్, కనకరాజు, లోవరాజు, వెంకటేశ్, సుబ్బయ్య, గణపతి, నాగార్జున, గోవింద్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

అవనిపై హరివిల్లు

విజయవాడలో సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్

ప్రథమ బహుమతి గెలుచుకున్న తమిళనాడు మహిళ

కడప, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన హోంమంత్రి అనిత



ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న కృష్ణాజిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ



ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.భార్గవి (తమిళనాడు) సొంతం చేసుకోగా, మూడు ద్వితీయ బహుమతులను రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి) సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపనేని ఉషారాణి వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

ఆంధ్రజ్యోతి
ABN
యవ్వనపు చర్మ రహస్యం
SANTOOR
సెల్సియా
BRA - PANTIES - SLIPS & LEGGINGS
TRADE ENQUIRY : 93445 53675
ఎటువంటి పంటలకైనా
క్రాఫ్ట్‌వారి పెర్‌ఫెక్ట్



ద్వితీయ బహుమతులు అందుకుంటున్న రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి).. (కుడి నుంచి ఎడమకు), ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి అనిత





కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న పి.జ్యోతి (శ్రీకాకుళం), ఎం.రాజు (విజయనగరం), నాగమల్లేశ్వరి (కృష్ణా), డి.ఉష (నెల్లూరు), కవిత (ప్రకాశం), ఏ.సునీత (గుంటూరు), జి.శ్రీలక్ష్మి (కర్నూలు), ఎస్.రమ్యకృష్ణ (అనంతపురం), రెడ్డిరాణి (చిత్తూరు), ఏ.సంతోషి (విశాఖపట్నం), రోహిణి (కర్ణాటక). చిత్రంలో ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి

సింహగిరిపై సంక్రాంతి సంబరాలు రేపు

సింహాచలం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింహగిరిపై సోమవారం సంక్రాంతి సంబరాలు జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నామని దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భోగి రోజున సూర్యోదయాన మంటలు వేయడంతో సంబరాలకు శ్రీకారం చుడతామని చెప్పారు. భక్తులకు కనువిందు చేసేవిధంగా గ్రామీణ వాతావరణం ఆవిష్కృతం చేసేందుకు పూరిగుడిసెలు, గొబ్బెమ్మలు, ముత్యాల ముగ్గులు, చెరకు గడల జాలువలతో పాటు డూడూ బసవన్నలు, కొమ్మదాసరులు, జంగమ దేవరలు, హరిదాసుల వేషధారణలు, ఎడ్ల బండి ప్రదర్శన, కపిలగోవు, గిత్తలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే సంక్రాంతి పురస్కరించుకుని రంగవల్లుల పోటీలు నిర్వహిస్తున్నామని, ఆదివారం సాయంత్రం 4 నుంచి రాత్రి 8 వరకు ప్రధాన రాజగోపురానికి ఎదురుగా ఉన్న మాడవీధిలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు భోగి నాడు బహుమతి ప్రదానం జరుగుతందని, చిన్నారులకు భోగి పండ్లు వేసే కార్యక్రమాన్ని కూడా చేపడతామని తెలిపారు. 15న కనుమ సందర్భంగా శ్రీకృష్ణాపురంలోని దేవస్థానానికి చెందిన గోశాలలో గోవులకు ఉదయం 9 నుంచి పూజలు జరుపుతామన్నారు. ఈ వేడుకల్లో సింహగిరి గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

విశాఖ పోర్టును సందర్శించిన ట్రైనీ ఐఏఎస్ అధికారులు



ట్రైనీ ఐఏఎస్ అధికారులతో విశాఖపోర్టు విభాగాధిపతులు సీనియర్ అధికారులు

విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ట్రైనీ ఐఏఎస్ అధికారుల బృందం వింటర్ స్టడీ టూర్‌లో భాగంగా శనివారం విశాఖపట్నం పోర్టు అథారిటీని సందర్శించింది. వారికి పోర్టు ఉన్నతాధికారులు ఆత్మీయంగా స్వాగతించారు. పోర్టులో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వారికి వివరించారు. మౌలిక వసతులు, కార్గో హ్యాండింగ్ సామర్థ్యం, ఆధునీకీకరణ, మెకనైజ్డ్ ప్రాజెక్టులు, కవర్డ్ స్టోరేజీ సౌకర్యం, సోలార్ పవర్ ప్లాంట్, వంటి వాటి గురించి వివరించారు.



శ్రావ్యంగా సాగిన సిధ్ శ్రీరామ్ సంగీత కచేరీ



హాజరైన 'నవయుగ' సంస్థ చైర్మన్ సీవీ రావు, తదితరులు



కీర్తనలు ఆలపిస్తున్న సిధ్ శ్రీరామ్

సిరిపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో శనివారం సాయంత్రం ప్రముఖ గాయకుడు సిధ్ శ్రీరామ్ నిర్వహించిన సంగీత గాత్ర కచేరీ ఆద్యంతం అలరించింది. ఆయనకు వయొలిన్‌పై హెచ్ఎన్ భాస్కర్, మృదంగంపై డాక్టర్ ప్రతి సతీష్‌కుమార్, కంజీరాపై అనిరుధ్ ఆత్రేయ సహకారం అందించారు. తోడిరాగవర్ణంతో ఆరంభమైన కచేరీ నాసికాభూషణి రాగంలోని 'మారవైరి..రమణ', బహుదారి రాగంలో 'బ్రోవభారమా'..., పంతువరాళిరాగంలో 'శంకరినిన్నే' తదితర కీర్తనలను శ్రీరామ్ ఆలపించిన తీరు మైమరపించింది. నళినకాంతి రాగంలో 'మనవి యాలకించ...', అభేరి రాగంలో 'నగుమోము..' భవప్రియ రాగంలో 'శ్రీకాంతనీయెడ..' కీర్తనలు గాయకుని సంగీత ప్రతిభకు నిదర్శనంగా నిలిచాయి. అంతకుముందు నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ సంస్థ చైర్మన్ సీవీ రావు కళాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతీసంప్రదాయాలను గౌరవించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుత యువత మన కళలు, విశిష్టమైన అంశాలపై దృష్టిసారించాలని కోరారు.

సాగర తీరంలో వినోదానికి వేదిక

» వైజాగ్ ఎక్స్‌పో ప్రారంభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, తదితరులు

మహారాణిపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబం అందరికీ ఆహ్లాదాన్ని పంచే వేదికగా వైజాగ్ ఎక్స్‌పో-2025 నిలుస్తుందని శాసనమండలి సభ్యుడు వేపాడ చిరంజీవిరావు అన్నారు. శనివారం బీచ్‌రోడ్డులోని సబ్‌మెరైన్ మ్యూజియం ఎదురుగా వైజాగ్ ఎక్స్‌పోను ప్రారంభించారు. చిరంజీవిరావు మాట్లాడుతూ నగరం వినోదానికి వేదికగా నిలుస్తుందని, కొండపల్లి బొమ్మలతో తయారు చేసిన గేటు ఆహూతులను ఆకర్షిస్తూ విశాఖ వాసులు సంక్రాంతి పండుగ జరుపుకోవటానికి ప్రత్యేక వేదికగా నిలుస్తుందన్నారు ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన ఆట వస్తువులు, జలకన్యలు వంటివి చిన్నారులను అలరిస్తాయని అన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్‌వీ పట్టాభి రామ్ మాట్లాడుతూ కశ్మీర్‌ను నమూనా తీసుకొని ఏర్పాటు చేసిన విధానం అందరినీ ఆకర్షిస్తుందని, ప్రత్యేక అనుభూతికి లోనవుతారని అన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో ఎన్నో ప్రత్యేకతలు సంతరించుకున్నాయని పేర్కొన్నారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు రాజారెడ్డి మాట్లాడుతూ జలకన్యలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శన ఆందరినీ ఆకర్షిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బైరెడ్డి పోతనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఎక్కుతుండగా జారి పడి విద్యార్థిని మృతి



మృతి చెందిన విద్యార్థిని భరణి

పద్మనాభం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : బస్సు ఎక్కుతుండగా జారి పడి ఇంటర్ విద్యార్థిని మృతి చెందింది. పద్మనాభం సీఐ సీహెచ్ శ్రీధర్ తెలిపిన వివరాలు ప్రకారం.. ఆనందపురం మండలం కుసులువాడకు చెందిన కొంద్రు భరణి (17) తగరపువలసలోని బాసర కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. శనివారం కళాశాలకు వెళ్లేందుకు ఏనుగులపాలెం వద్ద అదే కళాశాల బస్సు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందకు పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ముక్కు, నోటి వెంట తీవ్రంగా రక్తం రావడంతో స్థానికులు ఆమెను కొమ్మాది గాయత్రి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బాలిక మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. బాలిక తండ్రి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శ్రీధర్ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా అప్పారావు ఆటో వేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. మృతి చెందిన భరణి రెండో కుమార్తె.

కోడి పందాలు ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు

ఎండాడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మధురవాడలో కోడి పందాల శిబిరంపై పోలీసులు శనివారం సాయంత్రం దాడి చేశారు. పీఎంపాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు మేరకు.. మధురవాడలోని సాయిప్రియా గార్డెన్స్ ప్రాంతంలోఉన్న సెయింట్ ఆన్స్ స్కూల్ పక్కనున్న ఖాళీ ప్రదేశంలో కోడి పందాలు జరుతున్నాయని పోలీసులకు సమాచారం అందింది. ఈమేరకు దాడి చేసి, పందాలు ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే రెండు కోళ్లు, రూ. 6210 నగదు స్వాధీనం చేసుకున్నారు.

రైల్వే ట్రాక్‌పై యువతిని రక్షించిన ఆర్పీఎఫ్

విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యకు పాల్పడిన యువతిని ఆర్పీఎఫ్ మర్రిపాలెం సిబ్బంది కాపాడారు. మర్రిపాలెం, గోపాలపట్నం స్టేషన్ల మధ్యగల రైల్వే ట్రాక్‌పై అనుమానాస్పదంగా నిలబడిన యువతిని ఆర్పీఎఫ్ ఎస్ఐ ఎం.నాయక్, కానిస్టేబుల్ మూర్తి గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించారు. ప్రియుడు గతంలో చేసిన మోసంతో మనస్తాపానికి గురై ఇంటి నుంచి పారిపోయి వచ్చానని, ఏమి చేయాలో తెలియక ఆత్మహత్య చేసుకోవాలనుకున్నానని తెలిపింది. ఆమెకు కౌన్సెలింగ్ చేశాక బంధువులకు అప్పగించారు.

CLASSIFIEDS

PLOTS FOR SALE

★ విశాఖపట్నం, సబ్బవరం ఎడ్యుకేషన్ హబ్ నందు నేషనల్ లా కాలేజ్ వెనుక భాగం, Opp. గాలి భీమవరం పాలిటెక్నిక్, SBI కోలని, వుడా లేఅవుట్‌లో 168, 176 గజాలు వుడా ప్లాట్స్ అమ్మకమునకు కలవు.
* G+2 Individual House (or) Ground Floor for Sale. శ్రీనివాసనగర్, సింహాచలం. No Mediators. సంప్ర॥ 9885226354, 6303824415
AJV_230794

★ 4 లక్షల 40 వేలకే ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్స్ @ అనకాపల్లి & దేవరాపల్లి గేటెడ్ కమ్యూనిటీ, క్లబ్ హౌస్, స్విమ్మింగ్ పూల్. ఫోన్ : 88852 87788
AJV_205227

★ సువర్ణ అవకాశము VMRDA అప్రూవుడ్ Plots కొత్తవలసలో కేవలం రూ.4999/- గజము మాత్రమే. కొనండి, కొనిపించండి. Cont: 7995406518.
AJV_205225

★ VUDA Plot - 179 sq.yds. S/F 33 ft. Road, Simhapuri Layout, BRTS 200 ft. Road 1/2 km Simhachalam to Vepagunta Road. Cont.: 8309494629, 9885180930
AJV_205228

HOUSE FOR SALE

★ వేపగుంట 5 km పెదగాడిలో 240 చ.గ. N/F, 40 ft. రోడ్డు డూప్లెక్స్ హౌస్ అమ్మకం & ఫ్లాట్స్ అమ్మబడును, కొనబడును. సంప్ర॥ 6300182379, 9848884879
AJV_205205

★ కమర్షియల్‌కు ఉపయోగపడే ఇండివిడ్యువల్ హౌస్ 53.5 చ॥గ॥లలో ఉన్న తూర్పు ఫేసింగ్ ఇల్లు కూర్మన్నపాలెం వడ్లపూడి, RH కోలనీ, కణితి మెయిన్ రోడ్‌లో అమ్మకమునకు కలదు. సంప్ర॥ 8142435865, 9908972912
AJV_205206

SHOP FOR SALE

★ Shop for Sale 266 sft. (10x26) in gated community having 384 Flats, G/F, Happy Homes, Old ITI Jn., Rate 28 Lakhs. Cont.: 89856 72299
AJV_205212

SITE FOR SALE

★ 800 sq. yds. Vuda approved site available for sale at Boyapalem Near 100 feet Road Near Chilikuri Layout. Cont: 98668 90860
AJV_205213

For Advertisement Contact :
9963231176
9966165093

TDR FOR SALE
Contact for Plan Approvals, Constructions.
PILLA BRAHMAJI RAO
Retired Building Inspector
GVMC PRESENT LICENCED SURVEYOR
92904 41348

CHANGE OF NAME

★ I, TANETY SUSHMA (Old Name), W/o. Tanety Kiran Babu, R/o. Flat No.D2, Sagara Dweepa Apartment, Plot No.46A, Kirlampudi Layout, Visakhapatnam. Change my name from TANETY SUSHMA (Old Name) to MEKALA SUSHMA (New Name). Henceforth I am being called as MEKALA SUSHMA (New Name) for all purposes.
AJV_230793

CHANGE OF NAME

★ I, CHINTA RAMESH (Old Name), S/o. Chinta Suguna Ratnam, R/o. 7-125, Antervedipalem, Dr. B.R. Ambedkar Konaseema. Change my name from CHINTA RAMESH (Old Name) to CHINTA RAMESH KUMAR (New Name). Henceforth I am being called as CHINTA RAMESH KUMAR (New Name), S/o. Chinta Suguna Ratnam for all purposes.
AJV_230795

WANTED COMMERCIAL SPACE

★ Wanted Immediately Long Lease Building for Corporate College above 25000 sft. to 1 lakh sft. Old Building or Under Construction Building or 1000 sq.yrd. to 1 acre Site out rate or development Near National Highway at Vizag City, Kurmannapalem, Madhurawada to Tallavalasa, Sriharipuram, Gajuwaka, BC Road, Dabagardens, Muralinagar and Wanted out rate Commercial Site or Building in VSP City limits @ 9395111133
AJV_5677

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి